# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 12-7-2026  NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.  సంపుటి :32  సంచిక:265  పేజీలు:6  వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

తీరగు నణు యొప్పందము
భారత్త్రాస్ట్రేలియాల ప్రగతికి మరి యు
ద్గారమ్ముల తగ్గింపుకు
దారుల నేర్పరచె ముదము తాండవ మాడన్ !!

(భారత్ ఆస్ట్రేలియాల మధ్య జరిగిన అణు ఒప్పందం రెండు దేశాల ప్రగతికి, కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి దారులను ఏర్పాటు చేస్తూ ఇరు దేశాలకు సంతోషాన్ని కలిగిస్తున్నది.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

వర్షాలు పడకుంటే
వదులదింకా క్షామం
తప్పదింకా సర్కారుకు
తలనొప్పిగా సంక్షేమం.
నదుల నీరు ఒడిసిపట్టి
నింపకుంటే చెరువులు
ఆగిపోతే సాగుబాటు
ఆందోళన దరువులు.



-వేల్పుల నారాయణ
9440433475

# హుజూర్‌నగర్‌కు కొత్త బస్టాండ్..

## -మంత్రి పొన్నం శ్రీనివాస్ హామీ




హైదరాబాద్, జులై 11:హుజూర్‌నగర్ నూతన బస్టాండ్‌కు శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఆర్టీసీ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని పనిచేస్తోందని అన్నారు.

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేశామని మంత్రి గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలు సుమారు రూ.11 వేల కోట్ల విలువైన ఉచిత ప్రయాణాలు చేశారని తెలిపారు. ప్రస్తుతం ఆర్టీసీలో రోజుకు లక్షలాది మంది ప్రయాణిస్తుండగా, అందులో సుమారు 30 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని చెప్పారు.

ఆర్టీసీ బలోపేతానికి 2,800 కొత్త బస్సులు కొనుగోలు చేశామని, మరో 3,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. కొత్త డిపోలు మంజూరు చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా బస్టాండ్ల ఆధునీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, హుజూర్‌నగర్ బస్టాండ్ నిర్మాణాన్ని కూడా త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నదని విమర్శించిన మంత్రి, ప్రస్తుతం సంస్థను నష్టాల నుంచి గట్టెక్కిస్తూ అనేక డిపోలను లాభాల బాటలో నడిపిస్తున్నామని పేర్కొన్నారు. కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించడంతో పాటు పీఆర్సీ అమలు, బకాయిల చెల్లింపు, కార్మిక సంఘాల ఎన్నికల ప్రక్రియను కూడా ప్రారంభించామని చెప్పారు.

రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి ఆర్టీసీ సేవలను విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేసిన మంత్రి, రహదారులు అందుబాటులో ఉన్న ప్రతి ప్రాంతానికి బస్సులు నడుపుతున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో కూడా కొత్త మార్గాల్లో అదనపు బస్సులను ప్రవేశపెట్టి ప్రజా రవాణాను మరింత బలోపేతం చేస్తున్నామని వివరించారు.

ఈ సందర్భంగా సాగునీటి అంశాన్ని ప్రస్తావించిన మంత్రి, హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు చేస్తూ, నీటిపారుదల శాఖలోని సమస్యలను ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో అన్ని జిల్లాలు పరస్పరం పోటీపడి ముందుకు సాగాలని మంత్రి ఆకాంక్షించారు.

## వియత్నాం బోటు ప్రమాదంలో తెలుగు రాష్ట్రాల వాసుల గల్లంతు

న్యూఢిల్లీ, జులై 11: వియత్నాంలో భారతీయ పర్యాటకులతో వెళ్తున్న ఓ బోటు ప్రమాదానికి గురికావడంతో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఫు క్వాక్ ద్వీప సమూహంలోని ఆన్థోయ్ సమీపంలోని హోన్ మే రూట్ ప్రాంతంలో పర్యాటకులతో వెళ్తున్న బోటు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 18 మంది భారతీయ పర్యాటకులు మృతిచెందినట్లు సమాచారం. పలువురు గల్లంతవగా.. వారికోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

ప్రమాదం జరిగిన సమయంలో బోటులో మొత్తం 32 మంది భారతీయులు ప్రయాణిస్తున్నట్లు వియత్నాం అధికారులు వెల్లడించారు. ప్రమాదం అనంతరం వియత్నాం కోస్ట్ గార్డ్, స్థానిక రెస్క్యూ బృందాలు వేగంగా సహాయక చర్యలు చేపట్టి 21 మందిని సురక్షితంగా రక్షించాయి. అయితే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని తెలుస్తోంది.

ఈ ప్రమాదంలో కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కిషోర్ కుటుంబం కూడా చిక్కుకుంది. ఈ ఘటనలో ఆయన భార్య మృతిచెందినట్లు సమాచారం. కిషోర్ అపస్మారక స్థితిలో ఉండటంతో వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఈ ఘటనపై భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది. బాధిత కుటుంబాలకు అవసరమైన సాయమందించేందుకు అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది.

## జూలై 14లోగా ఎన్యూమరేషన్ ఫారమ్‌లు సమర్పించాలి

అమరావతి, జులై 11:భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి అర్హత కలిగిన ఓటరు తన ఎన్యూమరేషన్ ఫారమ్‌ను తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. జూలై 14తో ఈ ప్రత్యేక కార్యక్రమం ముగియనున్నందున మిగిలిన రోజులను సద్వినియోగం చేసుకుని ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆమె కోరారు.

శనివారం జిల్లా ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 14,05,443 మంది ఓటర్లు నమోదై ఉన్నారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, విశ్వసనీయతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి రెండు ఎన్యూమరేషన్ ఫారమ్‌లను అందజేస్తున్నారని తెలిపారు. ఒక ఫారమ్‌ను ఓటరు స్వీకరించినట్లు అంగీకారంగా ఉంచుకుని, రెండో ఫారమ్‌ను అవసరమైన వివరాలతో పూరించి తిరిగి బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని సూచించారు. అందిన ఫారమ్‌లన్నింటినీ డిజిటలైజ్ చేసి తుది ఓటరు జాబితా తయారీలో వినియోగిస్తామని చెప్పారు. ఫారమ్‌ను సమర్పించని పక్షంలో సంబంధిత ఓటరు పేరు ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు కాకపోయే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

జిల్లాలో ఇప్పటివరకు 10,90,722 ఎన్యూమరేషన్ ఫారమ్‌లు ఓటర్ల నుంచి అందగా వాటిని విజయవంతంగా డిజిటలైజ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్ల సహకారంతో మరణించిన వారు, డూప్లికేట్ నమోదులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లకు సంబంధించిన 55,449 ఫారమ్‌లను కూడా డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇంకా 2,59,272 ఎన్యూమరేషన్ ఫారమ్‌లు ఓటర్ల నుంచి అందాల్సి ఉందన్నారు.

# 182 సీట్లలో 117 గెలుస్తాం..



ఖమ్మం, జులై 11: ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో నిర్వహించిన 'రైతు ఆశీర్వాద సభ'లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తుది విడతగా రూ.1,009 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేసిన అనంతరం ప్రసంగించిన ఆయన.. 2028 డిసెంబరులో ఎన్నికలు జరగవని, 2029 జూన్‌లోనే ఎన్నికలు జరుగుతాయని అన్నారు.

రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్విభజన అనంతరం లోక్‌సభ స్థానాలు 25కు, అసెంబ్లీ స్థానాలు 182కు పెరుగుతాయని పేర్కొన్నారు. ఆ 182 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ 117 స్థానాల్లో విజయం సాధించి వరుసగా రెండోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

తాను గతంలో చేసిన ఎన్నికల అంచనాలు నిజమయ్యాయని గుర్తుచేసిన సీఎం.. కాంగ్రెస్‌కు 65 సీట్లు వస్తాయని చెప్పగా 64 స్థానాలు గెలిచిందని, ఉప ఎన్నికల్లో మరో రెండు స్థానాలు గెలిచి బలం పెంచుకుందని అన్నారు. అలాగే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని తాను ముందే చెప్పానని, అదే జరిగిందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పై ఘాటు విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి.. "భద్రాచలం శ్రీరాముడిపై ఆన.. ఇది కాంగ్రెస్ ప్రతిజ్ఞ. రాసి పెట్టుకోండి.. ఈరోజు చెప్పింది జరిగితీరుతుంది" అని అన్నారు. తెలంగాణ ప్రజలు తమపై విశ్వాసం ఉంచారని, రాబోయే రాజకీయ పోరాటంలో కూడా విజయం కాంగ్రెస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణలో పెట్టుబడులకు ఎమిరేట్స్ ఆసక్తి..

### సీఎం రేవంత్‌రెడ్డితో కీలక చర్చలు



హైదరాబాద్, జులై 11: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా ఎమిరేట్స్ వైమానిక సంస్థ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్ధన్ ఈరోజు(శనివారం) సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎంతో చర్చించారు. ఎమిరేట్స్ వైమానిక సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సీఎంను మర్యాదపూర్వకంగా ఎమిరేట్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కలిశారు. హైదరాబాద్‌లో ఎమిరేట్స్ ఎ-38 సర్వీసులను ప్రారంభించేందుకు ఈ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుముఖత వ్యక్తం చేశారు.

ఎమిరేట్స్ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని సీఎం కోరారు. తెలంగాణలో మరో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో అక్కడ కూడా ఎమిరేట్స్ ఓఖీూ ఆపరేషన్స్ కొనసాగించాలన్న సీఎం సూచించారు. విమాన సర్వీసులకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్‌నకు ముందుకు రావాలని సీఎం కోరారు. ఈ విషయంపై సానుకూలంగా ఎమిరేట్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ స్పందించారు.

## హైదరాబాద్‌లో తొలి సీఎంపీ టెక్నాలజీ హబ్

### 18-24 నెలల్లో దేశీయ సీఎంపీ ప్యాడ్ల తయారీ లక్ష్యమన్న మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, జులై 11:సెమీకండక్టర్ రంగంలో తెలంగాణ మరో కీలక మైలురాయిని చేరుకుంది. దేశంలోనే తొలి సీఎంపీ (కెమికల్ మెకానికల్ పాలిషింగ్) ప్యాడ్ టెక్నాలజీ హబ్ హైదరాబాద్‌లోని టీ-వర్క్స్ కేంద్రంలో ప్రారంభమైంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం ఈ హబ్‌ను ప్రారంభించారు. జపాన్‌కు చెందిన తోహో కోకి సంస్థ సాంకేతిక సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

సెమీకండక్టర్ చిప్‌ల తయారీలో అత్యంత కీలకమైన సీఎంపీ ప్యాడ్ సాంకేతికత దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో అందుబాటులోకి రావడం ద్వారా స్వదేశీ సెమీకండక్టర్ పరిశ్రమకు కొత్త ఊపు లభించనుంది. ఈ హబ్ ద్వారా విద్యార్థులు, స్టార్టప్‌లు, పరిశోధకులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ పొందడంతో పాటు పరిశోధన, ప్రోటోటైప్ అభివృద్ధి, ఉత్పత్తి రూపకల్పనకు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉంటాయి.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, రాబోయే 18 నుంచి 24 నెలల్లో దేశీయంగా సీఎంపీ ప్యాడ్ల తయారీ ప్రారంభించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సెమీకండక్టర్ తయారీకి అవసరమైన కీలక సాంకేతికతలను తెలంగాణలోనే అభివృద్ధి చేసి, రాష్ట్రాన్ని దేశంలోని ప్రముఖ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

జపాన్‌తో సాంకేతిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ, ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ టెక్నాలజీల అభివృద్ధికి ఈ హబ్ కీలక వేదికగా మారుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, ప్రోటోటైపింగ్, చిప్ తయారీ వరకు సమగ్ర సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌ను తెలంగాణలో నిర్మించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని ఆయన వెల్లడించారు.

# భారత్-న్యూజిలాండ్ బంధం మరింత బలోపేతం

**-భారత ప్రధాని నరేంద్ర మోదీ**
**-ఆక్లాండ్‌లో భారతీయులను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని..**
**-క్రీడలు, వాణిజ్యం, అంతరిక్ష రంగాల్లో సహకారంపై దృష్టి**
**-భారతీయుల సేవలను కొనియాడిన న్యూజిలాండ్ ప్రధాని లక్సన్..**
**-'కివీ ఇండియన్' సమాజం దేశాభివృద్ధికి కీలకమని వ్యాఖ్య**



న్యూ ఢిల్లీ, జులై 11: న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా ఆక్లాండ్‌లో నిర్వహించిన భారతీయ ప్రవాసుల సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ రెండు దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ స్నేహబంధాన్ని గుర్తు చేశారు. భారత్-న్యూజిలాండ్ సంబంధాలు ప్రజల మధ్య ఉన్న అనుబంధంతో మరింత బలపడుతున్నాయని పేర్కొన్నారు. క్రీడలు, వాణిజ్యం, సాంకేతికత, అంతరిక్షం, విద్య తదితర రంగాల్లో రెండు దేశాలు కలిసి మరిన్ని విజయాలు సాధించగలవని విశ్వాసం వ్యక్తం చేశారు.

న్యూజిలాండ్‌లో భారతీయ మూలాలున్న పలువురు ప్రముఖులు వివిధ రంగాల్లో అత్యున్నత స్థానాలను అధిరోహించారని మోదీ గుర్తు చేశారు. ఎయిర్ న్యూజిలాండ్ సీఈఓ నిఖిల్ రవిశంకర్, మాజీ గవర్నర్ జనరల్ ఆనంద్ సత్యానంద్, క్రికెటర్లు రచిన్ రవీంద్ర, ఇష్ సోధి, అజాజ్ పటేల్ వంటి వారు అందుకు ఉదాహరణలని అన్నారు. న్యూజిలాండ్‌లోని పలు ప్రాంతాలకు బాంబే, ఢిల్లీ, అమృత్‌సర్, కలకత్తా, కోరమండల్ వంటి భారతీయ నగరాల పేర్లు పెట్టడం రెండు దేశాల మధ్య ఉన్న ఆత్మీయతకు నిదర్శనమని చెప్పారు.

భారత్-న్యూజిలాండ్ క్రీడా సంబంధాలకు ఈ ఏడాదితో వందేళ్లు పూర్తవుతున్నాయని ప్రధాని గుర్తు చేశారు. 1926లో భారత హాకీ జట్టు న్యూజిలాండ్‌లో పర్యటించగా, మేజర్ ధ్యాన్ చంద్ ప్రతిభ అక్కడి ప్రజల మనసులు గెలుచుకుందని పేర్కొన్నారు. రగ్బీ క్రీడలో న్యూజిలాండ్ నుంచి భారత్ ఎంతో నేర్చుకోవాల్సి ఉందని, కోచ్‌లు, సాంకేతిక నిపుణుల సహకారంతో ఈ భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంతరిక్ష రంగంలో కూడా రెండు దేశాల సహకారం కొనసాగుతోందని మోదీ చెప్పారు. చంద్రయాన్ విజయానికి న్యూజిలాండ్ సాంకేతిక సహకారం కూడా దోహదపడిందని పేర్కొన్నారు. అలాగే వాణిజ్య ఒప్పందాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, స్టార్టప్‌లు వంటి రంగాల్లో భారత్ వేగంగా ఎదుగుతోందని వివరించారు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచిందని ఆయన అన్నారు.

మావోరీ సంస్కృతిని ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాని, 'హాకా' సంప్రదాయంలో ధైర్యం, ఆత్మగౌరవం, సమిష్టి శక్తి ప్రతిఫలిస్తాయని చెప్పారు. మావోరీల 'మనకితాంగ' భావన, భారతీయుల 'అతిథి దేవో భవ' సంప్రదాయం ఒకే విలువలను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు.

అలాగే సిక్కు సంప్రదాయాలకు సంబంధించిన 'జోడే సాహిబ్'ను పాట్నా సాహిబ్‌కు తీసుకెళ్లిన విషయాన్ని ప్రస్తావించిన మోదీ, హేమ్‌కుండ్ సాహిబ్‌కు రోప్‌వే నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. సాహిబ్‌జాదాల త్యాగాలను స్మరించేందుకు ప్రతి ఏడాది డిసెంబర్ 26న 'వీర్ బాల్ దివస్' నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఇక, ఒక భారత ప్రధాని న్యూజిలాండ్‌ను సందర్శించడానికి గతంలో 40 సంవత్సరాలు పట్టిందని గుర్తు చేసిన మోదీ, ఇకపై అంత సుదీర్ఘ విరామం ఉండదని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ కూడా పాల్గొన్నారు. న్యూజిలాండ్‌లో నివసిస్తున్న సుమారు 3.3 లక్షల భారతీయ మూలాలున్న ప్రజలు దేశ ఆర్థిక వ్యవస్థకు కీలక బలంగా మారారని ఆయన కొనియాడారు. వారి ద్వారా ఏటా సుమారు 37 బిలియన్ డాలర్ల ఆర్థిక విలువ సృష్టించబడుతోందని, అది దేశ జీడీపీలో సుమారు 9 శాతం వాటా కలిగి ఉందని తెలిపారు. వైద్యులు, నర్సులు, ఇంజనీర్లు, ఐటీ నిపుణులు, వ్యాపారవేత్తలు, అకౌంటెంట్లు వంటి అన్ని రంగాల్లో భారతీయులు విశేష సేవలు అందిస్తూ న్యూజిలాండ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని లక్సన్ ప్రశంసించారు.

## తెలంగాణ బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా మారబోతోంది: అశ్వినీ వైష్ణవ్

హైదరాబాద్, జులై 11: దేశంలో 7 బుల్లెట్ ట్రైన్స్ ప్రకటిస్తే.. అందులో తెలంగాణకు 3 దక్కాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కారణంగానే తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్స్ దక్కాయని వెల్లడించారు. తెలంగాణ బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా మారబోతోందని అన్నారు. బుల్లెట్ ట్రైన్స్ అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 1 గంట 10 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి ముంబైకి 2 గంటల 20 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి చెన్నయ్‌కి రెండు గంటల్లో వెళ్లవచ్చని చెప్పారు.

ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ దేశంలో పెద్ద మార్పునకు శ్రీకారం చుట్టబోతోంది. కొంతమంది దీని క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రెడిట్ కేవలం నరేంద్ర మోదీకి మాత్రమే దక్కుతుంది. నరేంద్ర మోదీ.. బడ్జెట్‌లో తెలంగాణకి నిధులు పెంచారు. యూపీఏ ప్రభుత్వం 800 కోట్ల రూపాయలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తే.. మేము తెలంగాణకు 5000 కోట్ల రూపాయలు ఇచ్చాము' అని అన్నారు.

## ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

అమరావతి, జులై 11: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ వెంకటస్వామి చౌదరి, డాక్టర్ వినీత మాట్లాడుతూ సరైన సమయంలో గర్భధారణ, పిల్లల మధ్య తగిన వ్యవధి పాటించడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని తెలిపారు.

అంతరా ఇంజెక్షన్లు, ఐయూసీడీలు, కండోమ్‌లు వంటి కుటుంబ నియంత్రణ సాధనాలు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

"పిల్లల మధ్య దూరం పాటిద్దాం.. తల్లి-బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుదాం" అనే నినాదాలతో టవర్ క్లాక్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని పెద్దకౌకుంట్ల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కూడా ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పలు కాలనీల వరకు అవగాహన ర్యాలీ చేపట్టి కుటుంబ నియంత్రణ, తల్లి-శిశు ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# ఒక చైల్డ్, ఒక టీచర్, ఒక బుక్, ఒక పెన్ ప్రపంచాన్ని మార్చగలవు - మలాలా యూసఫ్‌జాయ్

తన 17వ ఏటనే నోబెల్ శాంతి పురస్కారాన్ని పొందిన అతి చిన్న వయస్కురాలిగా మలాలా యూసఫ్‌జాయ్ రికార్డును నెలకొల్పడం మనకు తెలుసు. బాలికలకు విద్యా హక్కు, లింగ సమానత్వం, మహిళా సాధికారత లాంటి సామాజిక సవాళ్లను అతి చిన్న వయస్సులోనే చేపట్టి ప్రపంచ మానవాళి దృష్టిని ఆకర్షించిన మలాలా యూసఫ్‌జాయ్ జన్మదినం 12 జూలై సందర్భంగా ఐరాస నేతృత్వంలో ప్రతి ఏట "మలాలా దినోత్సవం" పాటించడం ఆనవాయితీగా మారింది. అసమాన ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచిన చిన్నారి ప్రపంచ మానవాళిని ప్రభావితం చేసిన అతి కొద్ది మందిలో ఒకరుగా పేరుగాంచింది.

ఒక బిడ్డ, ఒక టీచర్, ఒక పుస్తకం, ఒక కలం ప్రపంచాన్ని మార్చగలవు:

"ఒక బిడ్డ, ఒక టీచర్, ఒక పుస్తకం, ఒక కలం ప్రపంచాన్ని మార్చగలవు" అని నమ్మే మలాలా యూసఫ్‌జాయ్ పాకిస్థాన్‌లోకి ఒక చిన్న పట్టణం "మింగోరా"లో 12 జూలై 1997న జన్మించింది. 2007లో ఆ చిన్న పట్టణం తాలిబన్ తీవ్రవాదులు అధీనంలోకి తీసుకొని బాలికలు పాఠశాలకు వెళ్లవద్దని, సంగీతం/టివీలు చూడవద్దని మూర్ఖంగా నిషేధం విధించారు. చదువు మీద అమిత ఆసక్తి కలిగిన మలాలా ధైర్యంగా తాలిబన్ల నిర్ణయాన్ని ఎదిరించి 2009లో బిబిసి ఉర్దూ మీడియాకు ఈ విషయం గూర్చి కాయడంతో ప్రతీకారంగా 2012లో ఆమెను తాలిబాన్ ముష్కరులా కాల్చడంతో తీవ్రంగా గాయపడి, ఆ దాడి నుంచి బయట పడి ఇంగ్లాండ్‌లో చికిత్స తీసుకొని, అక్కడే తన కుటుంబం స్థిరపడడం జరిగింది.

## ఐక్యరాజ్యసమితిలో మలాలా యూసఫ్‌జాయ్ ప్రసంగం:

12 జూలై 2013న తన 16వ పుట్టిన రోజున మలాలా యూసఫ్‌జాయ్ ఐక్యరాజ్యసమితిలో ఒక శక్తివంతమైన ప్రసంగం చేసి ప్రపంచాన్ని నివ్వెర పరిచింది. అదే రోజున ఐరాస చొరవ తీసుకొని మలాలా యూసఫ్‌జాయ్ పుట్టిన రోజు 12 జూలైన ప్రతి ఏట మలాలా దినోత్సవం పాటించాలని ప్రపంచ దేశాలను కోరడం జరిగింది. "ఐ యామ్ మలాలా" అనే పేరుతో తన ఆత్మకథను పుస్తకరూపంలోకి తెచ్చి ప్రపంచ మానవాళికా ప్రేరణగా నిలిచింది. ప్రాణాంతక దాడికి భయపడకుండా బాలికల విద్య హక్కు కోసం గళం విప్పి నిప్పులు చెరిగిన మలాలా కోట్ల మంది చిన్నారులకు ఆరాధ్య దైవంగా, స్ఫూర్తినిచ్చే అసాధారణ చిన్నారిగా నిలిచింది. అమ్మాయిలు చదువుకొని, ఎదిగి, సమాజంలో నాయకురాల్లుగా నిలవాలని మలాలా జీవితం మార్గనిర్దేశనం చేస్తున్నది. మలాలా దినోత్సవం వేదికగా బాలికల సాధికారత దిశగా అడుగులు వేయడం, వారి విద్యా హక్కులను కాపాడడం, లింగ అసమానతలను తగ్గించడం నిరంతరం జరగాలని ప్రచారం చేయడం కొనసాగాలి.

సవాళ్లను, పేదరికాన్ని ఎదిరిస్తూ బాలికలు చదువుకోవాలని మలాలా ధైర్యంగా పిలుపును ఇస్తున్నది. బాలికలు, మహిళలను రెండవ శ్రేణి వ్యక్తులుగా చూడడం తగదని పురుషాధిక్య సమాజాన్ని మేల్కొలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్న మలాలా మనందరికీ ఆదర్శప్రాయురాలిగా నిలుస్తున్నది. పుస్తకం, కలం మాత్రమే శక్తివంతమైన ఆయుధాలని పిలుపును ఇవ్వడం, కత్తి, కలంతో పాటు స్త్రీ శక్తి కూడా అత్యంత బలవంతమైనవే అని గళం విప్పిన మలాలా ప్రభావం నేడు ప్రపంచ బాలికలకు దారి దీపంగా మారింది. మలాలా జీవిత కథ స్ఫూర్తిదాయకం. బాలికల, యువతులకు సాధికారత కల్పించాలనే మలాలా సందేశం నిజం కావాలని, లింగ సమానత్వం సాధించడానికి మనందరం కృషి చేయాలి.



-మధుపాళీ
9949700037

# ఉద్యోగ ఉపాధులు పొందిన యువతే దేశానికి వెన్నెముక

**- లయన్: కెప్టెన్: డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, ప్రముఖ రచయిత, వక్త, విశ్రాంత ప్రిన్సిపాల్**




హైదరాబాద్, జులై 11:నేటి విద్యార్థినీవిద్యార్థుసు తమ తమ చదువుల్లో రాణిస్తూ, కావలసిన నైపుణ్యాలను నేర్చుకొని ఉన్నత ఉద్యోగ ఉపాధులు పొందితే వారు దేశాభివృద్ధికి గట్టి పునాదులు వేస్తారని ప్రముఖ రచయిత, వక్త, విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్ : కెప్టెన్ : డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు స్థానిక ధన్గర్వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ విద్య, ఉపాధులకు దూరంగా నిర్జీవంగా కాల గడిపే యువత కుటుంబానికే కాకుండా దేశానికి కూడా భారమని అన్నారు. అత్యున్నత చదువులు చదివి ఆకర్షణీయమైన ఉద్యోగాలు పొంది పేదరికాన్ని ఆమెడ దూరం పరిగెత్తించాలని ప్రేరణ ఇచ్చారు. అత్యధిక యువజనాభా కలిగిన భారతానికి ఉజ్వల భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత యువతీయువకులపై మాత్రమే ఉందని అన్నారు. నేటి యువత సన్మార్గంలో ఎదిగితే వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించి విశ్వగురు స్థానానికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ ఆచార్య వి శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుతో పాటు స్కిల్స్ నేర్చుకోవడం తప్పనిసరి అయ్యిందని, ప్రతి విద్యార్థి పాఠ్య పుస్తకాలను చదవడంతో పాటు నైపుణ్యాలను సమాంతరంగా నేర్చుకునే ప్రయత్నాలు చేయాలని కోరారు. నైపుణ్యాల కల్పనలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఇంచార్జి హెచ్ఎం రమ దేవి మాట్లాడుతూ తమ విద్యార్థులకు చదువులతో స్కిల్స్ కూడా నేర్పిస్తామని వాగ్దానం చేశారు. దేశ జనాభా అంశంలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. క్లబ్ కార్యదర్శి లయన్ నార్ల వేణుగోపాల్ వందన సమర్పన చేయగా, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీఉపాధ్యాయులు కె. అనిల్, వి. సవేరా, శ్రీలత, జి. వసుంధర, ఆనందంతో పాటు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# కొచ్చిలో బ్రిక్స్ మహిళా మంత్రుల స్థాయి సదస్సు

న్యూఢిల్లీ, జులై 11:భారత 2026 బ్రిక్స్ అధ్యక్షతన కొచ్చిలో నాలుగు రోజుల పాటు జరిగిన బ్రిక్స్ మహిళా మంత్రుల స్థాయి సదస్సు ఈ రోజు విజయవంతంగా ముగిసింది. బ్రిక్స్ సభ్య దేశాల మధ్య మహిళల నేతృత్వంలోని అభివృద్ధిపై సహకారాన్ని పెంపొందించడంలో ఇది ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. 2026 జూలై 6 నుంచి 9 వరకు జరిగిన ఈ సదస్సులో బ్రిక్స్ మహిళా అధ్యయన బృందం (వర్కింగ్ గ్రూప్), బ్రిక్స్ మహిళా మంత్రుల స్థాయి సమావేశాలు జరిగాయి. లింగ సమానత్వం, మహిళా సాధికారతను పెంపొందించడం కోసం ఉమ్మడి ప్రాధాన్యతలపై చర్చించేందుకు బ్రిక్స్ కుటుంబానికి చెందిన మంత్రులు, డిప్యూటీ మంత్రులు, ఉన్నతాధికారులు ఈ సందర్భంగా ఒకే వేదికపైకి వచ్చారు.

మంత్రుల స్థాయి ముగింపు సదస్సులో కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి అన్నపూర్ణా దేవి మాట్లాడుతూ, బ్రిక్స్ సభ్య దేశాలకు విభిన్నమైన భౌగోళిక, సామాజిక, ఆర్థిక సాంస్కృతిక నేపథ్యాలు ఉన్నప్పటికీ మహిళా సాధికారత విషయంలో పలు ఉమ్మడి అంశాలనూ, సమస్యలనూ అవి పంచుకుంటున్నాయని పేర్కొన్నారు. సభ్య దేశాల మధ్య చర్చలను ప్రోత్సహించడానికీ, పరస్పర సహకారాన్ని పెంపొందించడానికీ బ్రిక్స్ మహిళా మంత్రుల వేదిక వంటివి అత్యంత కీలకమని ఈ ఉమ్మడి అంశాలు స్పష్టం చేస్తున్నాయని ఆమె అన్నారు.

కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీ అనిల్ మాలిక్ మాట్లాడుతూ, భారత్ అధ్యక్షతన జరిగిన ఈ చర్చల ప్రాధాన్యతను వివరించారు. బ్రిక్స్ మహిళా మంత్రుల సదస్సు సంయుక్త ప్రకటనను ఆమోదించడం ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవడంలో ఉమ్మడి సంకల్పానికి ఒక స్పష్టమైన నిదర్శనమని పేర్కొన్నారు.

మహిళా సదస్సుల చరిత్రలోనే తొలిసారిగా సంయుక్త ప్రకటనను ఆమోదించడం ఈ ఏడాది మహిళా మంత్రుల సమావేశంలో ఒక విజయం. అన్ని రంగాలలో మహిళల నేతృత్వంలోని అభివృద్ధిని ప్రోత్సహించడంలో భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి బ్రిక్స్ సభ్య దేశాలకున్న ఉమ్మడి సంకల్పాన్ని ఇది ప్రతిబింబిస్తోంది.

బ్రిక్స్ మహిళా వేదిక కింద దీర్ఘకాల సహకారాన్ని బలోపేతం చేయడం కోసం భారత్ ప్రతిపాదించిన రెండు కొత్త కార్యక్రమాలను కూడా ఈ సమావేశాలు స్వాగతించాయి:

బ్రిక్స్ సభ్య దేశాల్లో మహిళా సాధికారతకు సంబంధించిన విజయవంతమైన విధానాలు, కార్యక్రమాలు, వినూత్న ఆవిష్కరణలను నమోదు చేసి, పరస్పరం పంచుకునేందుకు ఉద్దేశించిన ఉమ్మడి వేదికగా బ్రిక్స్ డిజిటల్ రిపోజిటరీ ఆఫ్ బెస్ట్ ప్రాక్టీసెస్ పనిచేయనుంది.

బ్రిక్స్ డిజిటల్ కెపాసిటీ బిల్డింగ్ మార్గదర్శకాలు సంస్థాగత సహకారాన్ని ప్రోత్సహించడం, విజ్ఞాన మార్పిడిని సులభతరం చేయడం, నిరంతర సహకారం ద్వారా మహిళా సాధికారతను వేగవంతం చేసేందుకు సామర్థ్య నిర్మాణాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా రూపుదిద్దుకున్నాయి.

బ్రిక్స్ మంత్రుల స్థాయి సదస్సులో భాగంగా ప్రత్యేక ప్యానెల్ చర్చలను భారత్ నిర్వహించింది. డిజిటల్ భాగస్వామ్యం, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, ఆర్థిక సాధికారత, వాతావరణ సుస్థిరత, ఆహార భద్రత, పోషకాహారం మొదలైన అంశాలపై తమ అనుభవాలను, ఉత్తమ విధానాలను పంచుకోవడానికి విధాన నిర్ణేతలు, నిపుణులు, క్షేత్రస్థాయి కార్యకర్తలు, అభివృద్ధి భాగస్వాములను ఈ చర్చలు ఒకే వేదికపైకి తీసుకువచ్చాయి.

ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాలలో భారత్ చేపట్టిన 'మహిళల నేతృత్వంలోని అభివృద్ధి కార్యక్రమాలను ప్రదర్శించే ఎగ్జిబిషన్‌ను కూడా నిర్వహించారు. కేంద్ర మంత్రులు, ప్రముఖులు, విదేశీ ప్రతినిధులు ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.

వివిధ మంత్రిత్వ శాఖలూ, విభాగాలూ చేపట్టిన కార్యక్రమాలను ఈ ఎగ్జిబిషన్ లో ప్రదర్శించారు. వీటిలో సారస్, లఖ్‌పతి దీదీ కార్యక్రమాల ద్వారా గ్రామీణ జీవనోపాధి అభివృద్ధి, అస్మిత ద్వారా క్రీడల్లో మహిళల భాగస్వామ్యం, స్టెమ్ ద్వారా సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం రంగాల్లో మహిళలకు ప్రోత్సాహం, ఆర్థిక సమ్మిళిత కార్యక్రమాలు, మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న షీ-బాక్స్, వన్ స్టాప్ సెంటర్లు, మహిళా హెల్ప్‌లైన్ వంటి కార్యక్రమాలు ఉన్నాయి.

సమ్మిళిత, సుస్థిరమైన వృద్ధికి ప్రధాన చోదక శక్తిగా మహిళల నేతృత్వంలోని అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికీ, పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడానికీ, సంస్థాగత భాగస్వామ్యాలను బలోపేతం చేయడానికీ, విజ్ఞానం, ఉత్తమ విధానాల మార్పిడిని ప్రోత్సహించడానికీ బ్రిక్స్ సభ్య దేశాల ఉమ్మడి సంకల్పాన్ని ఈ సమావేశం పునరుద్ఘాటించింది.

# లక్షల విద్యా సంస్థలతో సహా దేశవ్యాప్తంగా 23 కోట్ల మందికి పైగా ప్రజలకు చేరువైన ఎన్ఎంబీఏ

న్యూఢిల్లీ, జులై 11:దేశంలో మాదకద్రవ్యాలను అరికట్టేందుకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆగస్టు 15, 2020న నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ)ను ప్రారంభించింది. ఈ విషయంలో ఉమ్మడి కార్యాచరణ అవసరాన్ని గుర్తిస్తూ.. డ్రగ్స్ నివారణ, అంచనా, చికిత్స, పునరావాసం, తదుపరి సంరక్షణ, ప్రజలకు సమాచారాన్ని చేరవేయటం, సమాజంలో అవగాహన కల్పించటంతో సహా వివిధ కార్యక్రమాలను ఈ మంత్రిత్వ శాఖ సమన్వయం చేస్తుంది.

భారతదేశంలో మాదకద్రవ్యాల వ్యసనం.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని వ్యక్తులు, కుటుంబాలు, సమాజాలపై ప్రభావం చూపుతున్న నిశ్శబ్ద సంక్షోభం. దీన్ని అరికట్టేందుకు ఎన్ఎంబీఏ ప్రారంభంలో 272 ప్రభావిత జిల్లాలను లక్ష్యంగా చేసుకుని, ఆ తర్వాత దేశవ్యాప్తంగా విస్తరించింది. దీనిద్వారా 7.81 కోట్లకు పైగా యువకులు, 5.24 కోట్ల మంది మహిళలు, 17 లక్షల విద్యాసంస్థలతో కలిపి మొత్తం 23 కోట్లకు పైగా ప్రజలను చేరుకుంది.

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ మాట్లాడుతూ.. దేశంలోని యువత ఆరోగ్యంగా, క్రమశిక్షణతో ఉండేలా చూసేందుకు నషా ముక్త్ భారత్ అభియాన్ అత్యంత కీలకమైన దేశ నిర్మాణ కార్యక్రమంగా పనిచేస్తుందన్నారు. భారతదేశాన్ని మాదకద్రవ్యాల రహిత దేశంగా మార్చేందుకు నార్కోటిక్స్ బ్యూరో వంటి నియంత్రణ సంస్థలు, రాష్ట్ర, జిల్లా ప్రభుత్వాలు, పోలీసు శాఖ, ఎన్జీవోలు, ఆసుపత్రులు మొదలైనవి సమన్వయంతో పనిచేసేలా ఎన్ఎంబీఏ దోహదపడిందని చెప్పారు.

మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు సాక్ష్యాధారాల ఆధారిత విధానాన్ని బలోపేతం చేసేందుకు నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిష్ఠాత్మక ప్రచార కార్యక్రమమని సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయమంత్రి శ్రీ రామ్‌దాస్ అథవాలే తెలిపారు. భారతదేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చాలనే ఉమ్మడి లక్ష్యం కోసం.. యువత భాగస్వామ్యంతో సంబంధిత విభాగాలను ఏకం చేస్తూ సమగ్రంగా ఈ అభియాన్ విధానం సాగుతుందని ఆయన తెలిపారు.

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయమంత్రి శ్రీ బి.ఎల్.వర్మ మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత భారతదేశ నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్న జాతీయ కార్యక్రమం నషా ముక్త్ భారత్ అభియాన్ అని తెలిపారు. ఈ ఉద్యమంలో యువత, మహిళలు, సమాజంలోని ఇతర సభ్యులను క్రియాశీలకంగా భాగస్వాములను చేస్తున్నట్లు.. ముఖ్యంగా ఉన్నత విద్యా సంస్థలు, యువజన క్లబ్బులు, మహిళా సంఘాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. డ్రగ్స్ వ్యసనం వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రతి పౌరుడికి అవగాహన కల్పించటమే ఈ ప్రచార ముఖ్య ఉద్దేశమని శ్రీ వర్మ చెప్పారు. ప్రాథమిక దశలోనే డ్రగ్స్ వాడకాన్ని నివారించటం, సమాజ భాగస్వామ్యం ద్వారా ఈ ఉద్యమం మరింత ఆరోగ్యకరమైన, సంతోషకరమైన సమాజాన్ని నిర్మిస్తుందని, మాదకద్రవ్యాల మహమ్మారిని అంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

ఎన్ఎంబీఏ ప్రధాన వాటాదారులు, లబ్ధిదారులు.. యువత, మహిళలు, పిల్లలు, విద్యా సంస్థలు, పౌర సమాజం, యావత్ సమాజం. ఈ కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి దేశవ్యాప్తంగా విస్తృత శ్రేణి కార్యక్రమాలు జరిగాయి. ఇవి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను, వాటాదారులను భాగస్వాములను చేశాయి. మాదకద్రవ్యాల వ్యసనం సమస్యపై గతంలో లాగా కేవలం సంస్థల ప్రమేయానికే పరిమితం కాకుండా ఇప్పుడు సమాజం మొత్తాన్ని భాగస్వామ్యం చేసేలా మార్పు వచ్చింది. రాష్ట్రాలు, జిల్లాలు, ఇతర వాటాదారులు ఈ అభియాన్‌ను బాధ్యతగా స్వీకరించటంతో ఇది ప్రజా ఉద్యమంగా మారింది.

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోని వివిధ విభాగాలు, వాటాదారులతో కుదుర్చుకున్న భాగస్వామ్యాల ద్వారా ఎన్ఎంబీఏ లక్ష్యం క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలైంది. ఈ భాగస్వామ్యాలు పౌరుల్లో బాధ్యతను పెంచి, మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించి సామాజిక వివక్షను తగ్గించాయి. అంగీకారాన్ని, జవాబుదారీతనాన్ని పెంపొందించాయి.

మాదకద్రవ్యాల వినియోగం మితిమీరి, వ్యసనంగా మార్చుకోవటం వల్ల సామాజిక, మానసిక, శారీరక సమస్యలు ఎదురవుతాయి. ఇది ఆరోగ్యాన్ని క్షీణించేలా చేయటమే కాక, పెను సామాజిక సమస్యగా మారింది. డ్రగ్స్ వ్యసనానికి గురైన బాధితులకు సాయం అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఉద్దేశించిన కార్యక్రమమే ఎన్ఎంబీఏ ప్రతిజ్ఞ. ప్రజలు డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా వారిలో బాధ్యతాయుతమైన ప్రవర్తనను, సామాజిక బాధ్యతను పెంపొందించటం ఈ ప్రతిజ్ఞ ఉద్దేశం. ఉమ్మడి లక్ష్యం కోసం భాగస్వాములందరూ కలిసి పనిచేసేలా ఐక్యతను, నిబద్ధతను ప్రోత్సహించటం దీని లక్ష్యం. ఈ ప్రతిజ్ఞ.. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత క్రియాశీలకంగా పాల్గొనేలా చేస్తుంది. హెల్ప్‌లైన్ నంబర్ 14446 ద్వారా మాదకద్రవ్యాల విముక్తిని ప్రోత్సహించేందుకు అందరూ కలిసి కృషి చేయాలి.

# 'జీఆర్ఏఐ గ్రూప్ ఏ' విభాగంలో ఆరో స్థానం దక్కించుకున్న డీఎఫ్ఎస్‌లోని బ్యాంకింగ్ డివిజన్

న్యూఢిల్లీ, జులై 11:కేంద్ర ఆర్థిక సేవల శాఖ పరిధిలోని బ్యాంకింగ్, బీమా విభాగాలు ఏటా 2.50 లక్షలకు పైగా ఫిర్యాదులను విజయవంతంగా పరిష్కరిస్తోంది. దీని ఫలితంగా నవంబర్ 2025 నుంచి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే గ్రీవెన్స్ రిడ్రెసల్ అసెస్‌మెంట్, ఇండెక్స్ (ఫిర్యాదుల పరిష్కార అంచనా, సూచీక-జీఆర్ఏఐ) ర్యాంకింగ్‌లలో తొలి 10 మంత్రిత్వ శాఖల్లో ఒకటిగా డీఎఫ్ఎస్ నిలుస్తోంది. పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ తాజాగా విడుదల చేసిన మే 2026 జీఆర్ఏఐ ర్యాంకింగ్‌లలో డీఎఫ్ఎస్ అద్భుత ప్రతిభ చాటింది. 500 లేదా అంతకంటే ఎక్కువ ఫిర్యాదులు నమోదయ్యే గ్రూప్-ఏ విభాగంలో బీమా విభాగం 2వ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇదే విభాగంలో బ్యాంకింగ్ డివిజన్ 6వ స్థానాన్ని దక్కించుకుంది.

ఫిర్యాదుల పరిష్కార నాణ్యతను పెంచేందుకు 7 జనవరి 2024 నుంచి ఒక ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని కింద ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి సంబంధిత ఆర్థిక సంస్థల చైర్మన్లు, ఎండీలు, సీఈఓలు, ఉన్నతాధికారులు, ఫిర్యాదుదారులు నేరుగా పాల్గొని ప్రతి నెల యాదృచ్ఛికంగా ఎంపిక చేసిన 20 ఫిర్యాదులను స్వయంగా సమీక్షిస్తున్నారు. వినియోగదారుల నమ్మకాన్ని పెంచేందుకు, సమస్యలకు అర్థవంతమైన పరిష్కారం చూపేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడింది.

ఆర్‌బీఐ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్ఆర్‌డీఏ సహా అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులతో కలిసి 'సమర్థవంతమైన ఫిర్యాదు పరిష్కార విధానం'పై కేంద్ర ఆర్థిక సేవల శాఖ ప్రత్యేక వర్క్‌షాపులను నిర్వహించింది. ఫిర్యాదుల మూలకారణాలను గుర్తించడం తోపాటు పరిష్కార నాణ్యతను పెంచడంపై ఈ సదస్సుల్లో దృష్టి సారించారు. వినియోగదారుల సమస్యలను వృత్తి నైపుణ్యంతో, పారదర్శకతతో, మానవతా దృక్పథంతో పరిష్కరించాల్సిందిగా అన్ని ఆర్థిక సంస్థలను ఈ వర్క్‌షాప్‌ల ద్వారా ప్రోత్సహించారు. దీని వల్ల ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం పెరగడమే కాకుండా సేవల నాణ్యత మెరుగవుతోంది. పరిపాలనను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్చడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.

## ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు

కరీంనగర్, జులై 11: కేంద్ర హోం సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను ఎల్కతుర్తి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ సాధారణ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన బండి సంజయ్ కుమార్ తన అంకితభావం, నిబద్ధత, నిరంతర పోరాట పటిమతో భారతీయ జనతా పార్టీలో జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగి, నేడు కేంద్ర హోం సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహించడం ప్రతి యువకుడికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

# ఎన్ఎఫ్‌డీసీ-ఎన్ఎఫ్ఏఐ పునరుద్ధరణ ప్రయత్నాలతో 4కే ఫార్మెట్లో పెద్ద తెర మీదకు తిరిగి వస్తున్న మలయాళం క్లాసిక్ చలనచిత్రం 'కిరీడమ్'

న్యూఢిల్లీ, జులై 11:మలయాళ చలనచిత్ర రంగంలో దృశ్యకావ్యంగా పేరు తెచ్చుకున్న 'కిరీడమ్' రేపు... అంటే 2026 జులై 10న... భారత్‌తో పాటు విదేశాల సినిమా థియేటర్లలో డాల్బీ ఎట్మాస్ సౌండ్, 4కే పునరుద్ధరణ వెర్షన్‌లో కనువిందు చేయబోతోంది. దీనికి జాతీయ చలన చిత్రాభివృద్ధి సంస్థకు చెందిన జాతీయ చలన చిత్ర పురావస్తు విభాగం (ఎన్ఎఫ్ డీసీ-ఎన్ఎఫ్ఏఐ) సరికొత్త వన్నెలద్ది మరీ ముస్తాబు చేసింది. పునరుద్ధరించిన ఈ చలన చిత్రాన్ని సెవెన్ ఆర్ట్స్ ఇంటర్నేషనల్ సంస్థ సహకారంతో ఎన్ఎఫ్‌డీసీ సమర్పిస్తోంది. ఈ సినిమాను హైజిన్ గ్లోబల్ వెంచర్స్ పంపిణీ చేస్తోంది.

ఈ చలన చిత్ర పునరుద్ధరణ ఘట్టం భారత్‌లో చలనచిత్ర వారసత్వాన్ని పరిరక్షించడానికి ఇస్తున్న ప్రాధాన్యానికి అద్దం పడుతోంది. 1989 నాటి ఈ చలన చిత్రానికి సంబంధించిన అసలు సిసలు కెమెరా నెగెటివ్ జీర్ణావస్థకు చేరి, పునరు పయోగానికి అనువుగా లేదు. అయినప్పటికీ, మొదట ఈ చిత్రాన్ని విడుదల చేసినప్పటి ప్రింటులలో ఒక 35 ఎమ్ఎమ్ ప్రింటును నేషనల్ ఫిలిం ఆర్కైవ్ ఆఫ్ ఇండియా 30 సంవత్సరాల కన్నా ఎక్కువ కాలం పాటు భద్రపరిచింది. ఈ ప్రింటును ఆధారంగా చేసుకొనే దానిని 4కే వెర్షన్‌గా పునరుద్ధరించారు.

కిరీడమ్ చిత్రానికి రచయిత శ్రీ ఎ.కె. లోహితదాస్. ఈ సినిమాకు శ్రీ శిబి మలయిల్ దర్శకత్వం వహించారు. సేతుమాధవన్ పాత్రలో శ్రీ మోహన్‌లాల్, హెడ్ కానిస్టేబుల్ అచ్యుతన్ నాయర్ పాత్రలో శ్రీ తిలకన్ నటించారు. మలయాళ సినీ రంగంలో అత్యుత్తమ సినిమాల్లో ఒకటిగా ఈ చలన చిత్రం పేరు తెచ్చుకుంది.

ఈ చలనచిత్ర పునరుద్ధరణ కార్యక్రమాన్ని సినిమాటోగ్రాఫర్ శ్రీ ఎస్. కుమార్, దర్శకుడు శ్రీ శిబి మలయిల్ పర్యవేక్షణలో చేపట్టారు. అధిక స్పష్టతను కలిగి ఉండే స్కానింగ్, డిజిటల్ ఇమేజి పునరుద్ధరణ సాంకేతికత, కలర్ గ్రేడింగ్ పూర్తి చేశారు. డాల్బీ అట్మాస్ సౌండ్ ను జతపరిచి ఈ సినిమా రీమాస్టర్ వెర్షనును తీసుకువచ్చారు. థియేటర్లకు ఇవ్వాలనుకున్న వెర్షను పనులను ప్రసాద్ కార్పొరేషన్ పూర్తి చేసింది. ఈ పనులకు హై స్టూడియోస్ సహకారాన్ని అందించింది. శ్రీ బోనీ అస్సనార్ క్రియేటివ్ విజనరీ హెడ్‌గా వ్యవహరించారు.

విడుదలయినప్పటి ప్రింటును దశాబ్దాల పాటు కాపాడి నందు వల్లే ఈ చిత్రాన్ని మళ్లీ ప్రేక్షకులకు అందించడం సాధ్యపడుతోందని ఎన్ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టరు శ్రీ ప్రకాశ్ మగుడమ్ అన్నారు. భారత చలనచిత్ర వారసత్వాన్ని సంరక్షించడానికి ఎన్ఎఫ్‌డీసీ-ఎన్ఎఫ్ఏఐ ఎంత నిబద్ధతతో పనిచేస్తోందో ఈ చలన చిత్రం పునరుద్ధరణే తెలియజేస్తోందని ఆయన అన్నా రు.

చిత్రం ప్రింటును పదిలపరచడంతో పాటు నేషనల్ ఫిల్మ్ హెరిటేజ్ మిషన్ కార్యక్రమాల్లో భాగంగా దీనిని పునరుద్ధరించినందుకు ఎన్ఎఫ్‌డీ సీ-ఎన్ఎఫ్ఏఐకి దర్శకుడు శ్రీ శిబి మలయిల్ ధన్యవాదాలు తెలిపారు. ఈ చిత్రాన్ని చాలా కాలం నుంచీ ప్రశంసిస్తున్న అభిమానులే కాకుండా, దీనిని సరికొత్త వెర్షన్లో పెద్ద తెర మీద చూడబోతున్న ఈ కాలం ప్రేక్షకులు ఈ చిత్రం అందించే అనుభూతిని ఆస్వాదించగలరన్న ఆశాభావాన్ని ఈ చిత్ర దర్శకుడు శ్రీ శిబి మలయిల్ వ్యక్తం చేశారు.

పునరుద్ధరించిన చిత్రాన్ని భారత 55వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో మొదటి సారిగా ప్రపంచ వ్యాప్త ప్రేక్షకులకు తొలిసారి ప్రదర్శించారు. ఈ చిత్రాన్ని ప్రేక్షక వర్గంతో పాటు చలనచిత్ర రూపకర్తలు కూడా చూసి, ఎంతో ఉత్సాహంగా ప్రతిస్పందించారు.

భారత్‌కున్న ఘనమైన శ్రవణ, దృశ్య మాధ్యమ వారసత్వాన్ని కాపాడుతూ, పునరుద్ధరణ పనులను చేపట్టి ప్రోత్సహించాలన్న కేంద్ర ప్రభుత్వ దార్శనికతను ఎన్ఎఫ్‌డీసీ-ఎన్ఎఫ్ఏఐ నిరంతరంగా సాకారం చేస్తోంది. శాస్త్రీయ పద్ధతిలో పరిరక్షణ, డిజిటలీకరణ, పునరుద్ధరణ ప్రక్రియల ద్వారా ఈ సంస్థ చలనచిత్ర కళాఖండాలను సమకాలీన ప్రేక్షకులకు పెద్ద తెరపై మరో సారి పరిచయం చేస్తుండడమే కాకుండా, ఇవి భావి తరాల వారికి కూడా అందుబాటులో ఉండేటట్లు ఈ సంస్థ శ్రద్ధ వహిస్తోంది.

# హైదరాబాద్‌లోని బీబీనగర్ ఎయిమ్స్ పురోగతిని సమీక్షించిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ జేపీ నడ్డా

న్యూఢిల్లీ, జులై 11:భారత ప్రభుత్వం ప్రధానమంత్రి స్వస్థ్య సురక్ష యోజన ఏడో దశ కింద హైదరాబాద్‌లోని బీబీనగర్‌లో 2019లో ఏర్పాటు చేసిన జాతీయ ప్రాముఖ్యత గల సంస్థ బీబీనగర్ ఎయిమ్స్ పురోగతిని ఈ రోజు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా సమీక్షించారు. ఈ ప్రాజెక్టు రూ. 1110.55 కోట్ల వ్యయంతో 2022 జూన్ నెలలో ప్రారంభమైంది.

ఈ సమీక్ష సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ నడ్డా మాట్లాడుతూ... ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆరోగ్య రంగం మౌలిక సదుపాయాలు, సామర్థ్య విస్తరణ పరంగా గణనీయమైన పురోగతి సాధించిందని పేర్కొన్నారు. 20వ శతాబ్దం చివరి నాటికి దేశంలో ఒకే ఒక్క ఎయిమ్స్ ఉండేదనీ, మాజీ ప్రధానమంత్రి శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో అదనంగా ఆరు ఎయిమ్స్‌లు ఏర్పాటయ్యాయని ఆయన గుర్తుచేశారు. అప్పటి నుంచి 16 కొత్త ఎయిమ్స్‌లు ఏర్పాటు చేయడంతో, దేశవ్యాప్తంగా వాటి మొత్తం సంఖ్య 23కి చేరిందన్నారు. వీటిలో 18 ఎయిమ్స్‌లు ఇప్పటికే పనిచేస్తుండగా, మిగిలినవి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని ఆయన వివరించారు.

తృతీయ శ్రేణి ఆరోగ్య సంరక్షణ సంస్థలను బలోపేతం చేస్తూనే... తమ ప్రభుత్వం ద్వితీయ శ్రేణి, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను విస్తరిస్తూ, పటిష్ఠం చేసిందన్నారు. తద్వారా ఏకరీతి, సమీకృత ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసిందని శ్రీ నడ్డా పేర్కొన్నారు. దేశంలో ఇప్పుడు 1.85 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు దాదాపు 150 కోట్ల మందికి సేవలందిస్తున్నాయని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. 2014 నాటికి దేశంలోని వైద్య కళాశాలల సంఖ్య 387 కాగా, ప్రస్తుతం వాటి సంఖ్య 820కి పెరిగిందనీ ఆయన తెలిపారు.

సంస్థకు సంబంధించిన మౌలిక సదుపాయాల అభివృద్ధి, వైద్య విద్య, రోగుల సంరక్షణ, పరిశోధన కార్యకలాపాలు, సంస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు సహా పలు అంశాలపై ఈ సందర్భంగా సిబ్బంది సవివరమైన ప్రజెంటేషన్ ఇచ్చారు.

బీబీనగర్ ఎయిమ్స్‌లో ప్రస్తుతం 132 మంది అధ్యాపకులు, 133 మంది సీనియర్ రెసిడెంట్లు ఉన్నారు. ఈ సంస్థ ఏర్పాటుతోనే ఇక్కడ ఎంబీబీఎస్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. ఇప్పటికే రెండు బ్యాచుల విద్యార్థులు ఈ కోర్సును పూర్తి చేశారు. 24 ఎమ్‌డీ విభాగాల్లో, అయిదు డీఎం/ఎంసీహెచ్ స్పెషాలిటీల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లూ నిర్వహిస్తున్నారు. 60 సీట్ల ప్రవేశంతో బీఎస్సీ నర్సింగ్ ప్రోగ్రామ్ 2024లో ప్రారంభం కాగా... అయిదు స్పెషాలిటీల్లో ఎంఎస్సీ నర్సింగ్ కోర్సును అందిస్తున్నారు. అనుబంధ ఆరోగ్య విద్య కోర్సులనూ ఇక్కడ అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సంస్థలో 902 మంది విద్యార్థులు ఉన్నారు. త్వరలో ఎంబీబీఎస్ విద్యార్థుల కొత్త బ్యాచ్ ప్రారంభం కానుంది.

ఈ సంస్థ అన్ని ప్రధాన స్పెషాలిటీల్లో ఔట్ పేషెంట్ సేవలను అందిస్తోంది. ప్రస్తుతం రోజుకు సుమారు 1,800 మంది రోగులకు సేవలు అందిస్తున్నారు. ఇందులో ఇన్‌పేషెంట్ సంరక్షణ కోసం 250 పడకలు ఉన్నాయి. ఇటీవల అత్యవసర సేవలూ ప్రారంభమయ్యాయి. సీటీ, ఎంఆర్ఐ, డెక్సా సహా చాలా వరకు రోగనిర్ధారణ పరీక్ష సదుపాయాలు, రేడియోలాజికల్ రోగనిర్ధారణ సదుపాయాలూ ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఈ సంస్థ తెలంగాణలోని 33 జిల్లాలకు ఇ-సంజీవని ద్వారా టెలికన్సల్టేషన్ సేవలనూ అందిస్తోంది. పీఎంజేఏవై-ఆరోగ్యశ్రీ పథకం కింద ఆరోగ్య సంరక్షణ సేవలను విస్తరిస్తోంది. సుమారు 90 శాతం మంది రోగులు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద నమోదు చేసుకున్నారు.

పరిశోధన రంగంలోనూ బీబీనగర్ ఎయిమ్స్ 129 ప్రాజెక్టుల ద్వారా రూ. 64 కోట్ల విలువైన పరిశోధన నిధులను సాధించడంతో పాటు... 1,156 పరిశోధన పత్రాలనూ ప్రచురించింది. కార్బన్-ఇంప్రెగ్నేటెడ్ లెగ్ ప్రోస్థెసిస్ (కృత్రిమ కాలు) 'ఏడీఐడీవోసీ' తయారీలోనూ ఈ సంస్థ డీఆర్‌డీవోతో కలిసి పనిచేస్తోంది.

బీబీనగర్ ఎయిమ్స్ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలను శ్రీ నడ్డా ప్రశంసించారు. ఈ సంస్థ ఆరు గ్రామాలను దత్తత తీసుకోవడంతో పాటు 547 సంచార వైద్య శిబిరాలను నిర్వహించిందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. "ఈ సంస్థ తన గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్రం (ఆర్‌హెచ్‌టీసీ), పట్టణ ఆరోగ్య శిక్షణ కేంద్రం (యూహెచ్‌టీసీ) ద్వారా సమీప ప్రాంతాల ప్రజలకు సేవలందిస్తోంది. ఇప్పటి వరకు 66,148 మంది రోగులకు లబ్ధి చేకూర్చింది. సుమారు 10 కిలోమీటర్ల పరిధిలో ప్రసారమయ్యే సామర్థ్యం కలిగిన ఒక కమ్యూనిటీ రేడియో స్టేషన్‌నూ ప్రారంభించి, దాని ద్వారా 43 విద్యాసంబంధిత కార్యక్రమాలను ప్రసారం చేస్తోంది" అని కేంద్ర మంత్రి తెలిపారు.

నిర్మాణ పనుల పురోగతి సమీక్షలో... సుమారు రూ. 902 కోట్ల విలువైన నిర్మాణ పనులు అంటే దాదాపు 87.4 శాతం పనులు పూర్తయినట్లు సిబ్బంది కేంద్ర మంత్రికి వివరించారు. ఆసుపత్రికి చెందిన సి, ఎఫ్ బ్లాకులు, ఆయుష్ భవనం, అమృత్ నివాస్, అకడమిక్ బ్లాక్, అండర్ గ్రాడ్యుయేట్-పోస్ట్ గ్రాడ్యుయేట్ హాస్టల్ భవనాల నిర్మాణం పూర్తయ్యింది. పాత భవనాల ఆధునీకరణ (రెట్రోఫిటింగ్) పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. రేడియోథెరపీ, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్ పనులు త్వరలోనే పూర్తవుతాయని భావిస్తున్నారు.

క్యాంపస్‌లో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్నీ కేంద్ర మంత్రి శ్రీ నడ్డా ప్రత్యేకంగా ప్రస్తావించారు. వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సమయం తీసుకునే ప్రక్రియే... దీనికి సహనం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. మానవ వనరులను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తూ... మరింత మంది సీనియర్ రెసిడెంట్లను నియమించుకోవడం, వారికి మరిన్ని గొప్ప అవకాశాలు కల్పించాల్సిన ప్రాముఖ్యతను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. అధ్యాపకుల కొరతను పరిష్కరించడానికి, స్టాండింగ్ సెలక్షన్ కమిటీ సమావేశాలను సంవత్సరానికి కనీసం నాలుగు సార్లు నిర్వహించాలని ఆయన సూచించారు. ఇతర ఎయిమ్స్ సంస్థలతో ఎక్స్‌చేంజ్ కార్యక్రమాలనూ అన్వేషించాలని, విజిటింగ్ ఫ్యాకల్టీని నియమించుకోవాలనీ ఆయన సూచించారు.

సమీక్ష అనంతరం సంస్థలోని ఇన్‌పేషెంట్ వార్డులు, కార్డియాలజీ విభాగంలో ఏర్పాటు చేయనున్న క్యాత్ ల్యాబ్, రేడియాలజీ విభాగంలోని ట్యూమర్ అబ్లేషన్, బయాప్సీ కోసం ఏర్పాటు చేసిన రోబోటిక్ నావిగేషన్ సిస్టమ్ వంటి వివిధ సౌకర్యాలను శ్రీ నడ్డా పరిశీలించారు. ఆయుష్ బ్లాక్‌లోని టీకా కేంద్రం, యోగా కేంద్రం, కమ్యూనిటీ రేడియో స్టేషన్‌నూ సందర్శించి... అక్కడ ఒక సంక్షిప్త సందేశం ఇచ్చారు. సంస్థ చేస్తున్న కృషిని కేంద్ర మంత్రి అభినందించారు. క్యాంపస్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను సమీక్షించి, ఆసుపత్రి మౌలిక సదుపాయాలపై పూర్తి సమాచారాన్ని తెలుసుకున్నారు. బీబీనగర్ ఎయిమ్స్ వైద్య విద్య, రోగుల సంరక్షణ, పరిశోధన రంగాల్లో అత్యుత్తమ కేంద్రంగా ఎదిగేందుకు కృషి చేస్తూనే... సామాజిక ఆరోగ్య సంరక్షణలోనూ తన సహకారాన్ని బలోపేతం చేసుకుంటోంది.

# సమ్మిళిత డిజిటల్ ఇండియాపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆశయానికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపు

## – కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా



న్యూఢిల్లీ, జులై 11:భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ల శాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "సమృద్ధి గ్రామ్:భారత్‌నెట్ ఆధారిత సమీకృత ఫిజిటల్ సేవా పంపిణీ నమూనా" ప్రాజెక్టు అంతర్జాతీయ స్థాయిలో విజేతగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'వరల్డ్ సమ్మిట్ ఆన్ ది ఇన్ఫర్మేషన్ సొసైటీ' (సమాచార వ్యవస్థపై ప్రపంచ సదస్సు-డబ్ల్యూఎస్ఐఎస్) ప్రైజెస్ 2026కు సంబంధించి యాక్షన్ లైన్ సీ6-ఎనేబ్లింగ్ ఎన్విరాన్‌మెంట్ విభాగంలో భారత్‌కు తొలి బహుమతి లభించింది. దేశంలోని మారుమూల, గ్రామీణ ప్రాంతాలకు సమీకృత డిజిటల్ సేవలను అందించాలన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. సమ్మిళిత గ్రామీణాభివృద్ధి కోసం డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, టెలికాం అనుసంధానాన్ని భారత్ వినియోగించిన వినూత్న విధానాన్ని గుర్తిస్తూ.. జెనీవాలో జరిగిన డబ్ల్యూఎస్ఐఎస్ వేదిక 2026 సదస్సులో ఈ పురస్కారాన్ని అందజేశారు.

అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ సంఘం (ఐటీయూ) నేతృత్వంలోని సమాచార వ్యవస్థపై ప్రపంచ సదస్సు ప్రక్రియలో భాగంగా ఈ అవార్డులను నెలకొల్పారు. ప్రపంచంలోనే సమాచార, సాంకేతిక రంగాల (ఐసీటీ) ద్వారా సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించే ప్రాజెక్టులకు ఇస్తున్న అత్యున్నత పురస్కారాలుగా ఇవి గుర్తింపు పొందాయి. అంతర్జాతీయ వేదికల వివిధ దేశాల ప్రభుత్వాలు, ఐక్యరాజ్యసమితి సంస్థలు, పరిశ్రమలు, విద్యావేత్తలు, పౌర సమాజం, అంతరాజాతీయ సంస్థలు భాగస్వాములుగా ఉంటాయి. ప్రజల అవసరాలే కేంద్రంగా, అందరికీ ప్రయోజనం చేకూరేలా, అభివృద్ధి వైపు సాగే డిజిటల్ మార్పును ఈ వేదిక ప్రోత్సహిస్తుంది.

కేంద్ర కమ్యూనికేషన్లు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం సింధియా ఈ ఘనతను సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఈ అంతర్జాతీయ గుర్తింపును "అంతర్జాతీయ వేదికపై భారతదేశ కీర్తి కిరీటంలో చేరిన మరో గౌరవం"గా ఆయన అభివర్ణించారు. సాంకేతిక ఫలాలు మారుమూల గ్రామాల్లోని ప్రతి పౌరుడికీ అందాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సమ్మిళిత డిజిటల్ ఇండియా ఆశయానికి దక్కిన ప్రపంచవ్యాప్త గుర్తింపుగా దీనిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను కేంద్ర మంత్రి ప్రస్తావించారు. భారత్‌నెట్ సహకారంతో నడిచే సమృద్ధి గ్రామ్.. గ్రామ స్థాయిలోని సమృద్ధి కేంద్రాల ద్వారా వైద్యం, విద్య, డిజిటల్ బ్యాంకింగ్, జీవనోపాధి సేవలను నేరుగా అందిస్తూ, అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని చెప్పారు. డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల రంగంలో భారత్ ప్రపంచ నాయకత్వాన్ని ఈ విజయం మరోసారి చాటి చెప్పిందని వివరించారు. దేశ ప్రత్యేక అవసరాల కోసం రూపొందించిన పరిష్కారాలు, ప్రపంచ వ్యాప్తంగా అమలు చేయదగ్గ అత్యుత్తమ నమూనాలుగా ఎలా నిలవగలవో ఇది నిరూపించిందన్నారు. ఈ ప్రాజెక్టుతో ముడిపడున్న భాగస్వాములందరినీ అభినందిస్తూ, దేశ డిజిటల్ పురోగతి ప్రయాణంలో ఇదొక గర్వించదగ్గ పరిణామంగా పేర్కొన్నారు.

కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ భారత్‌నెట్ మౌలిక సదుపాయాల ఆధారంగా చేపట్టిన సమీకృత గ్రామీణ డిజిటల్ పరివర్తన కార్యక్రమమే ఈ సమృద్ధి గ్రామ్. గ్రామ స్థాయిలో ఏర్పాటవుతున్న సమృద్ధి కేంద్రాలే ఈ కార్యక్రమానికి అత్యంత కీలకం. నమ్మకమైన టెలికాం అనుసంధానం, డిజిటల్ వేదికలు, ప్రత్యక్ష సహాయ సేవలను అనుసంధానిస్తూ గ్రామాల్లోనే అన్ని రకాల సేవలను ఒకే చోట అందించే కేంద్రాలుగా ఇవి పనిచేస్తున్నాయి.

ప్రజల అవసరాల కోసం ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, ఆర్థిక సేవలు, నైపుణ్యాభివృద్ధి, ఈ-పరిపాలన, ఈ-కామర్స్ వంటి అనేక రంగాలకు చెందిన సేవలను ఈ సమృద్ధి కేంద్రాలు ఒకే వేదిక కిందికి తీసుకువస్తాయి. దూరప్రాంతాల వైద్యులతో సంప్రదింపులు, ఆరోగ్య ఏటీఎంల ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు, పీఎం జన్ ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరకే మందుల పంపిణీని సమృద్ధ్ గ్రామ్ కేంద్రాలు చేపడతాయి. వీటితోపాటు డిజిటల్ తరగతి గదులు, ఏఆర్/వీఆర్ సాంకేతికత ఆధారంగా యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ.. ఐఓటీ ఆధారిత మట్టి పరీక్షలు, డ్రోన్ల సాయంతో ఎరువులు, పురుగుల మందుల పిచికారీ, మొబైల్ యాప్‌ల ద్వారా పనిచేసే డిజిటల్ నీటిపారుదల సౌకర్యాలు.. సీఎస్‌సీ ద్వారా ప్రభుత్వ సేవలు, బ్యాంకింగ్ కరస్పాండెంట్ల ద్వారా గ్రామాల్లోనే బ్యాంకింగ్ లావాదేవీలు.. స్థానిక ఉత్పత్తులను విక్రయించుకోవడానికి ఈ-కామర్స్ మద్దతు.. ప్రతి ఇంటికీ ఫైబర్ ఎఫ్‌టీటీహెచ్, పీఎం వాణి ద్వారా పబ్లిక్ వైఫై అనుసంధానం.. సీసీటీవీ కెమెరాల ద్వారా గ్రామాల పర్యవేక్షణ.. గ్రామీణ స్థాయిలో డిజిటల్ సదుపాయాలు కల్పించడం ద్వారా నిత్యావసర సేవలకు నిరంతర అందుబాటును కల్పించడం.. సమ్మిళిత, సాంకేతికతతో కూడిన గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించడం వంటి సమగ్ర సేవలను అందిస్తాయి.

భారత్‌నెట్, టెలికాం మౌలిక సదుపాయాలు కేవలం ఇంటర్నెట్ అనుసంధానాన్ని అందించడానికే పరిమితం కాకుండా.. గ్రామీణ ప్రజల జీవితాల్లో స్పష్టమైన సామాజిక, ఆర్థిక మార్పులను ఎలా తీసుకురాగలవో ఈ ప్రాజెక్ట్ స్పష్టంగా నిరూపిస్తోంది. స్థానిక సౌకర్యాలు, ప్రజల భాగస్వామ్యంతో కూడిన ఈ సమీకృత సేవా పంపిణీ నమూనా గ్రామీణ ప్రజల సాధికారతకు ఎంతగానో తోడ్పడుతోంది.

పటిష్టమైన టెలికాం మౌలిక సదుపాయాలను, ప్రజల అవసరాలకు అనుగుణమైన సేవా పంపిణీతో అనుసంధానించడం ద్వారా డిజిటల్ సమ్మిళితత్వాన్ని సాధించడంలో భారత్ సాధించిన విజయానికి ఈ అంతర్జాతీయ గుర్తింపు ఒక నిదర్శనం. ప్రపంచంలోనే అతిపెద్ద గ్రామీణ బ్రాడ్‌బ్యాండ్ కార్యక్రమాల్లో ఒకటైన భారత్‌నెట్ విప్లవాత్మక సామర్థ్యాన్ని కూడా ఇది చాటిచెప్పింది. ఇప్పటికే 2.17 లక్షలకు పైగా గ్రామ పంచాయతీలను పూర్తి డిజిటల్ సేవలకు సిద్ధం చేస్తూ ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చిన భారత్‌నెట్.. గ్రామీణ భారత్ అంతటా సరికొత్త డిజిటల్ అవకాశాలను, విస్తృత అందుబాటును కల్పిస్తోంది.

ప్రాజెక్ట నమర్పణ, అంతర్జాతీయ పరిశీలన, ప్రపంచవ్యాప్త ఆన్‌లైన్ ఓటింగ్, ఆయా విభాగాల్లోని తొలి 5 ఛాంపియన్ ప్రాజెక్టుల్లో ఒకటిగా ఎంపిక అవ్వడం, డబ్ల్యూఎస్ఐఎస్ నిపుణుల కమిటీ తుది తీర్పు వంటి అత్యంత కఠినమైన బహుళ దశల మూల్యాంకన ప్రక్రియను దాటుకుని ప్రపంచ స్థాయి విజేతగా సమృద్ధి గ్రామ్ నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా నామినేట్ అయిన అన్ని ప్రాజెక్టుల కోసం నిర్వహించిన ఆన్‌లైన్ ఓటింగ్ దశలో ఏకంగా 22 లక్షల కంటే ఎక్కువ ఓట్లు పోలయ్యాయి.

డబ్ల్యూఎస్ఐఎస్ 2026 కింద ఉన్న మొత్తం పద్దెనిమిది అవార్డుల విభాగాల్లో భారత్ నుంచి కేవలం రెండు ప్రాజెక్టులు మాత్రమే ఛాంపియన్ ప్రాజెక్టులుగా ఎంపికయ్యాయి. వాటిలో నుంచి సమృద్ధి గ్రామ్ ప్రాజెక్టు యాక్షన్ లైన్ సీ6-ఎనేబ్లింగ్ ఎన్విరాన్‌మెంట్ విభాగంలో ప్రపంచ విజేతగా నిలిచింది. ఇది గ్రామీణ డిజిటల్ పురోగతి కోసం భారత్ అవలంబిస్తున్న, ప్రపంచవ్యాప్తంగా అమలు చేయదగ్గ ప్రజా కేంద్రీకృత విధానానికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపును ప్రతిబింబిస్తుంది.

ఈ ప్రాజెక్టు వైద్య సేవలు, నాణ్యమైన విద్య, ఆర్థిక సమ్మిళితత్వం, ఉపాధి అవకాశాలు, ఆవిష్కరణలు, అసమానతల తగ్గింపు, డిజిటల్ సాధికారతను ప్రోత్సహించడం వంటి బహుళ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ఎంతగానో తోడ్పడుతోంది. సమ్మిళిత డిజిటల్ ప్రగతికి అనుకూలమైన విధానాలను, అమలు వాతావరణాన్ని కల్పిస్తూ డబ్ల్యూఎస్ఐఎస్ యాక్షన్ లైన్ సీ6 ఆశయాలకు పూర్తి మద్దతు ఇస్తోంది.

సమృద్ధి గ్రామ్ ప్రాజెక్టుకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అంతరాన్ని తగ్గించడంతో దేశ నాయకత్వాన్ని చాటిచెప్పింది. డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, టెలికమ్యూనికేషన్ రంగాలను ఉపయోగించుకుంటూ స్పష్టమైన సామాజిక, ఆర్థిక మార్పులను తీసుకురావడంలో దేశం సాధిస్తున్న విజయాలకు ఇది అద్దం పడుతోంది. వినూత్నమైన, విస్తరించదగిన, ప్రజా భాగస్వామ్య సేవా నమూనాల ద్వారా అందరికీ సమాన అవకాశాలు కల్పించే డిజిటల్ సాధికారత సమాజ నిర్మాణానికి భారత్ కట్టుబడి ఉందనే విషయాన్ని ఈ విజయం ప్రదర్శిస్తుంది.

# ఆస్ట్రేలియా-ఇండియా సీఈఓల ఫోరమ్, ఎకనామిక్ రోడ్‌మ్యాప్ బిజినెస్ ఈవెంట్‌లో ప్రసంగించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 11:మెల్‌బోర్న్‌లో జూలై 9, 2026న జరిగిన ఆస్ట్రేలియా-ఇండియా సీఈఓల ఫోరమ్, ఎకనామిక్ రోడ్‌మ్యాప్ బిజినెస్ సమావేశాల్లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధానమంత్రి గౌరవ ఆంథోనీ అల్బనీస్ ప్రసంగించారు. ఈ రెండు కార్యక్రమాల్లో భారత్, ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ కంపెనీల సీఈఓలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ఆస్ట్రేలియన్ సూపర్ యాన్యుయేషన్ ఫండ్స్ ప్రతినిధులు, అక్కడి ప్రముఖ విశ్వవిద్యాలయాల వైస్-ఛాన్సలర్లు పాల్గొన్నారు.

సీఈఓల ఫోరమ్ లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మాట్లాడుతూ భారతదేశంలోని బలమైన ఆర్థిక వృద్ధి, విధానపరమైన సంస్కరణలు, డిజిటల్ మార్పులు, విస్తరిస్తున్న ఆవిష్కరణలు, ఆస్ట్రేలియా భాగస్వాములకు నూతన వాణిజ్య అవకాశాలను కల్పిస్తాయని అన్నారు. భారత్, ఆస్ట్రేలియా వ్యవస్థల మధ్య పరస్పర అనుకూలతలను ఆయన ప్రస్తావించారు. భారత్ లో తయారీ రంగం, స్వచ్ఛ ఇంధనం, అరుదైన ఖనిజాలు, గనుల తవ్వకం, మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధి, విమానయానం, రవాణా, అధునాతన సాంకేతికతలు, కృత్రిమ మేధ, ఫిన్‌టెక్, ఆహార శుద్ధి, డిజిటల్ ఆర్థిక రంగాల్లోని విస్తృతమైన అవకాశాల గురించి ప్రధానమంత్రి వివరించారు. భారతదేశ విస్తృతమైన మార్కెట్‌కు ఆస్ట్రేలియా నైపుణ్యం తోడైతే ఇరుదేశాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

భారత్‌లో దీర్ఘకాలిక పెట్టుబడులకున్న అవకాశాలను వినియోగించుకోవాలని ఆస్ట్రేలియా పెట్టుబడిదారులను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆహ్వానించారు. భారతదేశంలో ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం పెరుగుతుండటాన్ని స్వాగతించారు. ఉన్నత విద్య, పరిశోధనలు, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధిలో ఇరుదేశాల మధ్య సహకారం మరింత బలోపేతం కావటం వల్ల ఇరుదేశాల యువత భవిష్యత్తు మెరుగవడమే కాక, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సహాయపడుతుందని స్పష్టం చేశారు. సీఈఓల ఫోరమ్ తర్వాత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఎకనామిక్ రోడ్‌మ్యాప్ కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఇరుదేశాలకు చెందిన 200 మందికి పైగా సీఈఓలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న సహజ అనుబంధం గురించి మాట్లాడుతూ ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలు, ఇండో-పసిఫిక్ ప్రాంతం పట్ల ఏకాభిప్రాయం, ఇరుదేశాల ప్రజల మధ్య ఆత్మీయ సంబంధాలు, బలమైన రాజకీయ అవగాహన వంటివి రెండు దేశాల వాణిజ్య భాగస్వామ్యం కలిసికట్టుగా ఎదగటానికి, అభివృద్ధి చెందటానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాయని చెప్పారు. 2022 నాటి ఆర్థిక సహకారం, వాణిజ్య ఒప్పందం (ఈసీటీఏ) ఆధారంగా వాణిజ్య, పెట్టుబడి సంబంధాలు వృద్ధి చెందటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఇరుదేశాల మధ్య వ్యాపార సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతిపాదిత సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందం (సీఈసీఏ) ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఇరుదేశాలు పరస్పర బలాలను వినియోగించుకుంటూ అరుదైన ఖనిజాలు, లిథియం, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్, ఈవీలు, సెమికండక్టర్లు, ఏఐ, రక్షణ రంగ సరఫరా వ్యవస్థలో అంతర్జాతీయ పరిష్కారాలను రూపొందించాలని వాణిజ్య రంగ ప్రముఖులను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కోరారు. ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు తదుపరి స్థాయికి చేరుకోవాలంటే భారతదేశంలోని రాష్ట్రాలు, ఆస్ట్రేలియా ప్రావిన్సుల ప్రధాన సామర్థ్యాల ఆధారంగా క్రియాశీల ఆర్థిక భాగస్వామ్యాలను ఏర్పరచుకోవటం ముఖ్యమని సూచించారు. రెండు కార్యక్రమాల్లో జరిగిన చర్చల ద్వారా వచ్చిన సానుకూల, అర్థవంతమైన ఆలోచనలను ప్రస్తావిస్తూ.. భారత్-ఆస్ట్రేలియా ఆర్థిక సంబంధాలు మరింత వృద్ధి చెందుతాయనే విశ్వాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యక్తం చేశారు.

# రక్షణ, భద్రతా రంగాల్లో సహకారంపై ఇండియా-ఆస్ట్రేలియా సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, జులై 11:భారత్, ఆస్ట్రేలియా ప్రధానమంత్రులమైన మేం.. మా మధ్య బలపడుతున్న ద్వైపాక్షిక సంబంధాల ద్వారా ఇరుదేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలనే సంకల్పంతో ఏకమై.. ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని స్వేచ్ఛా, శాంతియుత, స్థిరమైన, సుసంపన్నమైన ప్రాంతంగా మార్చాలన్న ఉమ్మడి ఆశయంతో రక్షణ, భద్రతా సహకారంపై సంయుక్త ప్రకటనకు కట్టుబడి ఉంటామని తెలియజేస్తున్నాం.

ఇరుదేశాల మధ్య 2020లో ఏర్పాటైన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం (సీఎస్‌పీ) ప్రాముఖ్యతను గుర్తించాం. సీఎస్‌పీ ప్రారంభమైనప్పటి నుంచి రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు మరింత వేగవంతమై, ఆర్థిక బంధాలు బలోపేతమయ్యాయి. ఇరుదేశాల ప్రజల మధ్య సన్నిహిత సంబంధాలు మరింత బలపడ్డాయి. క్వాడ్, ఇతర సంస్థల వంటి ప్రాంతీయ వేదికల ద్వారా ఇతర భాగస్వాములతో సహా ద్వైపాక్షికంగా, పలు విధాలుగా సన్నిహిత సంబంధాలు ఇరుదేశాలకు ప్రయోజనం చేకూర్చి, మన ఉమ్మడి ప్రాంత భద్రత, అభివృద్ధికి దోహదపడతాయి.


2009 నాటి భారత్-ఆస్ట్రేలియా ఉమ్మడి రక్షణ సహకార ప్రకటన ద్వారా ఇరుదేశాల భాగస్వామ్యంలో సాధించిన గొప్ప పురోగతిని మేం గుర్తుచేసుకున్నాం. విదేశాంగ మంత్రుల వ్యవస్థీకృత చర్చలు (ఎఫ్ఎంఎఫ్‌డీ), 2+2 విదేశాంగ, రక్షణ మంత్రుల చర్చలు.. రక్షణ మంత్రుల చర్చల వంటి వివిధ ద్వైపాక్షిక విధానాల ద్వారా ఈ భాగస్వామ్యానికి నవాకరించినందుకు అభినందనలు తెలియజేస్తున్నాం.

భౌగోళికంగా నెలకొన్న అనిశ్చితి, ప్రాంతీయ శాంతి, భద్రతలకు ఎదురవుతున్న ముప్పు పట్ల మేం ఆందోళన వ్యక్తం చేస్తున్నాం. సంబంధిత పక్షాలన్నీ శాంతియుతంగా పని చేయాలని కోరుతున్నాం. ఎలాంటి బెదిరింపులు, బలప్రయోగానికి పాల్పడకుండా అంతర్జాతీయ చట్టాలకు లోబడి వివాదాలను పరిష్కరించుకోవాలని పిలుపునిస్తున్నాం.

అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండే వ్యవస్థ, ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాంతీయ సమగ్రతను గౌరవించటం, 1982 ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టాల ఒప్పందానికి (యూఎన్‌సీఎల్ఓఎస్)కు కట్టుబడి ఉండటం ద్వారా సముద్ర ప్రయాణాలు, విమాన ప్రయాణాలు స్వేచ్ఛగా, సురక్షితంగా సాగటం.. సమర్థవంతమైన, సమ్మిళిత, పారదర్శకమైన సంస్థల మద్దతుతో ఇండో పసిఫిక్ ప్రాంతాన్ని స్వేచ్ఛా, శాంతియుత, స్థిరమైన, సంపన్నమైన ప్రాంతంగా మార్చేందుకు నిబద్ధతను తెలియజేస్తున్నాం.

ఆయా ప్రాంతాల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ఇండియన్ ఓషన్ రిమ్ అసోసియేషన్ (ఐఓఆర్ఏ), ఆసియాన్, ఆసియాన్ కేంద్రీకృత ప్రాంతీయ వ్యవస్థ, పసిఫిక్ ఐలాండ్స్ ఫోరమ్ (పీఐఎఫ్)లకు మేం మద్దతిస్తున్నాం.

మారుతున్న వ్యూహాత్మక పరిస్థితులకు అనుగుణంగా ఇరుదేశాల భాగస్వామ్యం మరింత వృద్ధి చెందాల్సిన అవసరాన్ని గుర్తించాం. ఇందులో భాగంగానే అత్యాధునిక, సమగ్ర, అగ్రశ్రేణి రక్షణ, భద్రతా రంగాల్లో ఉమ్మడి భాగస్వామ్యాన్ని వేగవంతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. మన వ్యూహాత్మక ప్రయోజనాల పరస్పర ఆసక్తిని ప్రతిబింబించేలా వ్యూహాత్మక వినిమయాన్ని బలోపేతం చేయటానికి, క్రమం తప్పకుండా మంత్రిత్వ స్థాయి చర్చల నిర్వహణను మేం కొనసాగిస్తాం. ఉమ్మడి శక్తిని పెంపొందించుకునేందుకు రక్షణ, భద్రతా రంగాల సహకారంలో దీర్ఘకాలిక దృక్పథాన్ని మనం గుర్తిస్తున్నాం. ఈ పరస్పర సహకారం ఇరుదేశాల భద్రతకు దోహదపడటమే కాక ప్రాంతీయ శాంతి, భద్రతలకు కూడా తోడ్పడుతుంది.



# సైబర్ భద్రత.. కీలక సాంకేతికతలు.. సరఫరా వ్యవస్థలపై ఆస్ట్రేలియా-భారత్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ, జులై 11:భారత్-ఆస్ట్రేలియా మధ్య సైబర్ రంగంతోపాటు కీలక సాంకేతిక పరిజ్ఞానాలలో ఒక శాశ్వత భాగస్వామ్య ఒప్పందం కుదిరింది. రెండు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం, సైబర్-తదాధారిత కీలక సాంకేతిక సహకారం చట్రంపై 2020 నాటి ఒప్పందం సహా రెండు దశాబ్దాల సంయుక్త పరిశోధన, కార్యాచరణ సమన్వయం, విధానపరమైన భాగస్వామ్యాల ప్రాతిపదికన తాజా ఒప్పందం ఖరారైంది.

దేశ ఆర్థిక వృద్ధికి చోదక శక్తులైన సరఫరా వ్యవస్థలు, కీలక సాంకేతికతలు, సైబర్ భద్రత రంగాలు జాతీయ భద్రతలోనూ కీలకమని రెండు దేశాలూ గుర్తించాయి. దీంతోపాటు విలువలు, ప్రపంచ ప్రమాణాల రూపకల్పనకు అవి తోడ్పడతాయని గ్రహించాయి. ఈ నేపథ్యంలో స్నేహ సంబంధాల పునాది ఆధారంగా "సైబర్, కీలక సాంకేతికతలు-సరఫరా వ్యవస్థల భాగస్వామ్యం" (పీఏసీటీఎస్-ప్యాక్ట్స్) కింద 2020 నాటి చట్రం స్థానంలో ద్వైపాక్షిక ప్రయోజనాలను తాజా ఒప్పందం ద్వారా మరింత ఉన్నతీకరించాలని సంకల్పించాయి.

జాతీయ-ప్రాంతీయ భద్రతలో ఉమ్మడి ప్రయోజనాలకు మద్దతు, భాగస్వాములకు మరిన్ని డిజిటల్ సదుపాయాల సౌలభ్యం, కీలక సరఫరా వ్యవస్థలకు పునరుత్థాన సామర్థ్యం కల్పన, ప్రపంచ సైబర్ భద్రత పునరుత్థాన సామర్థ్యం పెంపు తదితరాలకు 'ప్యాక్ట్స్' మద్దతిస్తుంది. ఈ భాగస్వామ్యం కింద ఉభయ దేశాల కృషిలోని ప్రతి దశలోనూ భద్రత, రక్షణ, పునరుత్థాన సామర్థ్యం, సార్వజనీనత, ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలకు సముచిత స్థానం ఉంటుంది. తద్వారా బాధ్యతాయుత సాంకేతిక అగ్రగాములుగా కొనసాగడంపై రెండు దేశాల నిబద్ధతకు ఇది నిదర్శనంగా నిలుస్తుంది. ఒక సమగ్ర ఏకీకృత వ్యూహాత్మక దృష్టి కింద ఈ కృషి క్రమబద్ధీకరణ ద్వారా 5 సహకార మూలస్తంభాల ద్వారా లక్షిత కార్యకలాపాల నిర్వహణకు వీలు కలుగుతుంది.

సహకార మూలస్తంభాలు

పరస్పరం ముడిపడిన ప్రతి మూలస్తంభం కింద ప్రైవేట్ రంగం, విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, ప్రభుత్వ వ్యవస్థల మధ్య సహకారానికి మద్దతుపై అందుబాటులోగల అవకాశాలను, నిర్దిష్ట ప్రాజెక్టులను భారత్-ఆస్ట్రేలియా గుర్తిస్తాయి. దీంతో ప్రభుత్వాల మధ్య సహకార విస్తృతి సహా నవ్య సాంకేతికతలలో రెండువైపులా పెట్టుబడులు పెరుగుతాయి. మరోవైపు మేధా సంపత్తిని ఆర్థిక వృద్ధికి దోహదం చేసే ఉత్పత్తులుగా మార్చడంలో మద్దతిస్తుంది.

రెండు దేశాల్లో విస్తరిస్తున్న సాంకేతిక పరిశ్రమలకు చేయూతనిస్తూ సురక్షిత, పటిష్ట, విశ్వసనీయ సరఫరా వ్యవస్థల కోసం ఆస్ట్రేలియా-భారత్ సంయుక్తంగా కృషి చేస్తాయి. భద్రత, రక్షణ ప్రక్రియల రూపకల్పనకు ప్రోత్సాహం, రక్షణాత్మక నియంత్రణ చట్రాల ఏర్పాటు, నియమాధారిత ద్వైపాక్షిక సాంకేతిక వాణిజ్యం-సరఫరా శ్రేణుల మరింత బలోపేతం వంటివి కూడా ఇందులో భాగంగా ఉంటాయి.

విశ్వసనీయ విక్రయ చట్రాలపై సహకారం దిశగా ద్వైపాక్షిక యంత్రాంగం ఏర్పాటు

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సురక్షిత, విశ్వసనీయ, పటిష్ట సముద్రగర్భ కేబుల్ సంధానానికి మద్దతుగా కేబుల్ అనుసంధానం-పటిష్టత కోసం ఏర్పాటు చేసిన క్వాడ్ భాగస్వామ్యం సహా, భారత్-ఆస్ట్రేలియా సహకారాన్ని ప్రోత్సహించడం. ఉత్తమ పద్ధతుల ఆదానప్రదానం, సమాచార మార్పిడి, సమన్వయం మెరుగుదల, ముప్పులు, విధ్వంసం సహా సముద్రగర్భ కేబుల్ మౌలిక సదుపాయాలకు ఎదురయ్యే ప్రమాదాల పరిష్కారం దిశగా సహకార బలోపేతం.

సెమీకండక్టర్ సరఫరా వ్యవస్థలకు రక్షణపై రెండు దేశాల్లోని పరిశోధన సంస్థల మధ్య సహకారాభివృద్ధి సహా వారి కృషికి బలం చేకూర్చేందుకు సహ-అభివృద్ధి, పరిశోధనలకు సదుపాయాల కల్పన.

[illegible] పెట్టుబడులు-నియంత్రణల అనుసంధానం, రీసైక్లింగ్, పునరుద్ధరణ సహా సురక్షిత కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థలపై అభివృద్ధిపై సహకారం.

ఆస్ట్రేలియా-భారత్ వ్యాపారాల మధ్య వాణిజ్య సహకారం, వ్యాపార వైవిధ్యీకరణకు ప్రోత్సాహం, అలాగే ప్రస్తుత కార్యక్రమాలను అనుసంధానించడం సహా సంబంధిత ఉన్నత సంస్థల మధ్య సంబంధాల బలోపేతం.

మూలస్తంభం 2: కీలక సాంకేతిక పరిజ్ఞానాలు

ప్రాధాన్యంగల కీలక సాంకేతికతల భద్రత, పునరుత్థాన సామర్థ్యం, సమగ్రతల బలోపేతం సహా కృత్రిమ మేధ (ఏఐ), అంతరిక్ష సాంకేతికతలు, టెలికమ్యూనికేషన్లు, బయోటెక్నాలజీ, అత్యాధునిక మూలకాలు వంటి కీలక రంగాల్లో నవ్య సాంకేతిక ఆవిష్కరణ దిశగా రెండు దేశాలూ సంయుక్తంగ కృషి చేస్తాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో దీర్ఘకాలిక ఆర్థిక భద్రత, ప్రాంతీయ స్థిరత్వానికి తోడ్పాటుగా అవసరమైన డిజిటల్, భౌతిక మౌలిక సదుపాయాల పరిరక్షణ, ఆవిష్కరణలు-పరిశోధనల వేగం పెంపు, పరస్పర సంధానంతో ఏకాభిప్రాయ సహిత అంతర్జాతీయ ప్రమాణాల రూపకల్పనకు కృషి చేస్తాయి.

విశ్వసనీయ, సురక్షిత కృత్రిమ మేధ దిశగా అంతర్జాతీయ ప్రమాణాల మెరుగుదల కోసం అంతర్జాతీయ కృషిని సద్వినియోగం చేసుకోవాలని రెండు దేశాలు నిర్ణయించాయి. ఇందుకోసం ప్రజాస్వామ్య విలువల ప్రాతిపదికన ఏకాభిప్రాయంతో వివిధ రంగాల భాగస్వామ్య చట్రాలను రూపొందించుకోవాలని సంకల్పించాయి. ఈ ప్రక్రియలో భాగంగా భారత్-ఆస్ట్రేలియా విద్యాసంస్థలు, ప్రైవేట్ రంగాల మధ్య భాగస్వామ్యాలను ప్రోత్సహించాలని తీర్మానించాయి. ఈ కార్యక్రమాల ద్వారా ఉభయ దేశాల పౌరులకు వాస్తవిక ప్రయోజనాలను... అంటే- ఏఐ పరిశోధకులు, నిపుణులు, విధాన రూపకర్తలు, ఉద్యోగులకు అవసరమైన విజ్ఞానాన్ని, నైపుణ్యాలను సమకూరుతాయి. ఏఐ సాంకేతికతల సురక్షిత రూపకల్పన, వినియోగాల కోసం ఉమ్మడి సూత్రాలు ఉత్తమ పద్ధతులను ప్రోత్సహించడంలో ఈ విజ్ఞానం దోహదం చేస్తుంది. మరోవైపు కంప్యూటింగ్ సామర్థ్యం, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం), ఏఐ-తత్సంబంధిత మౌలిక సదుపాయాల సురక్షిత వినియోగ విధానాల ఆదానప్రదానానికి ఈ కృషి తోడ్పడుతుంది.

ఆధునిక పదార్థాలు, టెలికమ్యూనికేషన్స్, బయోటెక్నాలజీ వంటి ప్రాధాన్య రంగాలపై భారత్-ఆస్ట్రేలియా నిశితంగా దృష్టి సారిస్తాయి. ఈ మేరకు పరిశోధన, ఆవిష్కరణలు, పెట్టుబడి భాగస్వామ్యాలను మరింత ముమ్మరం చేయాలని నిర్ణయించాయి. ఈ లక్ష్య సాధన దిశగా ప్రస్తుతం అమలయ్యే కార్యక్రమాల్లో తగిన మార్పులు చేసుకుంటాయి. తద్వారా పరస్పరం వాస్తవిక ప్రయోజనాలు లభించే పరిశోధన ప్రాజెక్టులకు నిధులు సమకూరుస్తాయి. ఈ కృషితో ద్వైపాక్షకంగానే కాకుండా విస్తృత ఇండో-పసిఫిక్ ప్రాంతానికీ లబ్ధి చేకూరుతుంది.

అంతరిక్ష రంగంలో రెండు దేశాల మధ్య భాగస్వామ్యం పరిణతి చెందుతుండటాన్ని భారత్, ఆస్ట్రేలియాలలో వేగంగా పురోగమిస్తున్న అంతరిక్ష రంగ కార్యకలాపాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉభయ దేశాల్లో ప్రభుత్వాల ఆధ్వర్యంలోని ప్రాజెక్టులు సహా సంయుక్త వాణిజ్య కార్యక్రమాలకు ప్రోత్సాహం దిశగా పరస్పర సహకార విస్తృతికి నిర్ణయించాయి.

సైబర్, డిజిటల్ రంగాల రక్షణ-భద్రతల బలోపేతానికి భారత్-ఆస్ట్రేలియా సంయుక్తంగా కృషి చేస్తాయి. సైబర్ నేరాల నియంత్రణ, హానికర సైబర్ కార్యకలాపాల నిరోధం ఇందులో భాగంగా ఉంటాయి. ఈ క్రమంలో సైబర్, సాంకేతిక భద్రత ప్రమాణాల సంబంధిత విజ్ఞానాన్ని, అనుభవాలను పంచుకోవడం సహా కీలక జాతీయ మౌలిక సదుపాయాల రక్షణకు ప్రాధాన్యమిస్తాయి.

సామర్థ్య వికాస చర్యలు, ప్రాంతీయ-బహుపాక్షిక సహకార అవకాశాల క్రమబద్ధీకరణ కోసం సైబర్, ఐసీటీ రంగాలలో సమగ్ర ద్వైపాక్షిక యంత్రాంగం ఏర్పాటవుతుంది. వివిధ కార్యాచరణ మార్గాల మధ్య విధానపరమైన స్పష్టతకు భరోసా ఇస్తూ ఒకే రకమైన కార్యకలాపాలు పునరావృతం కాకుండా ఈ యంత్రాంగం పర్యవేక్షిస్తుంది.

ఐక్యరాజ్యసమితి నిర్దేశిత సైబర్ ప్రక్రియలలో సహకార బలోపేతానికి రెండు దేశాలూ చర్యలు చేపట్టనున్నాయి. అలాగే, సమాచార నిర్వహణ సదుపాయాలు సహా టెలి కమ్యూనికేషన్స్ రంగంలో సైబర్ భద్రతపై అంతర్జాతీయ సహకారంపై చర్చలను మరింత మెరుగుపరచాలని నిర్ణయించాయి.

సైబర్ భద్రత, సాంకేతిక రంగాలలో భారత్-ఆస్ట్రేలియా వాణిజ్య సంస్థల మధ్య పెట్టుబడుల పెంపు, వ్యాపార విస్తరణకు మరిన్ని అవకాశాలను సృష్టిస్తాయి.

సైబర్ భద్రత రంగంలో రెండు దేశాల ప్రభుత్వ సంస్థలు, ఇతర భాగస్వాములను ఒకే వేదికపైకి తేవడం కోసం సంయుక్త చర్చా కార్యక్రమాలను నిర్వహిస్తాయి.

కీలక నైపుణ్యాల వృద్ధి, ఆదానప్రదానం కోసం ఒక సైబర్ సాంకేతిక నైపుణ్య ఇంక్యుబేటర్ కూడలిని ఏర్పాటు చేస్తాయి.

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో డిజిటల్ రూపం సంతరించుకుంటున్న ఆర్థిక వ్యవస్థలకు మద్దతుగా విశ్వసనీయ, విస్తరణీయ సాంకేతిక పరిష్కారాలు చూపడంలో భారత్-ఆస్ట్రేలియా సంయుక్తంగా కృషి చేస్తాయి. అలాగే, ప్రాంతీయ సామర్థ్యాలను బలోపేతం చేయగల నిర్దిష్ట ప్రాజెక్టులను గుర్తించి, ప్రగతి సంబంధిత సమస్యల పరిష్కారానికి కలిసి ముందడుగు వేస్తాయి.

ఇండో-పసిఫిక్ దేశాలతో కొత్త భాగస్వామ్య ఆదానప్రదానానికి భారత సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాల (డీపీఐ) సూత్రాధారితంగా రెండు దేశాలూ మద్దతిస్తాయి.

కాలుష్య రహిత పునరుత్పాదక ఇంధనం, మౌలిక సదుపాయాలు, అనుసంధానం, డిజిటల్ రూపాంతరీకరణ, ఆరోగ్యం, సామాజిక రక్షణ, నైపుణ్యాభివృద్ధి, విద్య, పరిశోధన తదితర రంగాల్లో చౌక 'డీపీఐ' పరిష్కారాలను ఇండో-పసిఫిక్ ప్రాంతానికి విస్తరింపజేస్తాయి.

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో 'డీపీఐ' ముమ్మర వినియోగం ద్వారా డిజిటల్ స్థిరత్వంలో ద్వైపాక్షిక నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తాయి. స్థానిక అనుకూల డిజిటల్ పర్యావరణ వ్యవస్థల రూపకల్పన కోసం సంయుక్త ప్రాజెక్టులు సహా వివిధ సామర్థ్య వికాస చర్యల ద్వారా ప్రాథమిక డిజిటల్ పరిష్కారాలపై దృష్టి సారించే ఇండో-పసిఫిక్ ప్రయోగాత్మక ప్రాజెక్టులకూ వీలు కల్పిస్తాయి.

రక్షణ రంగంలో వివిధ సవాళ్లు-సామర్థ్యాలపై ఉమ్మడి అవగాహన పెంపు దిశగా రక్షణ పరిశోధన భాగస్వామ్యాలను రెండు దేశాలూ సద్వినియోగం చేసుకుంటాయి. మునుపటి ఉమ్మడి పరిశోధనల ఆధారంగా పరస్పర ప్రయోజనానుగుణ భవిష్యత్తు ప్రాజెక్టులను రూపొందిస్తాయి. రక్షణ సహకారంపై అవగాహన ఒప్పందం (ఓసీఐ)లోని 'డిఫెన్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ' సహకార నిబంధనల మేరకు రక్షణ శాస్త్రవిజ్ఞాన సంస్థల మధ్య ఆదానప్రదానాన్ని ముమ్మరం చేస్తాయి.

రక్షణ మంత్రుల స్థాయి చర్చలు, రక్షణరంగ విధాన చర్చలు, పరిశ్రమలు-పరిశోధన, పదార్థాలపై ఏర్పాటైన సంయుక్త కార్యాచరణ బృందం తదితరాల ద్వారా రక్షణ శాస్త్ర-సాంకేతిక ప్రాథమ్యాలపై చర్చల వేగాన్ని పెంచుతాయి.

ఆస్ట్రేలియాలోని 'డిఫెన్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ గ్రూప్', భారత 'డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్' (డీఆర్డీఓ)ల మధ్య సంస్థాగత సంబంధాలను రెండు దేశాలూ పటిష్టం చేస్తాయి. పరిశోధన సహకారాన్ని వేగిరపరచే దిశగా కార్యాచరణ బృందం స్థాయిలో ఆదానప్రదానాన్ని క్రమబద్ధీకరిస్తాయి.రెండు దేశాల్లోని రక్షణ ఆవిష్కరణలు, అంకుర వ్యవస్థల మధ్య, వాణిజ్య సంస్థల మధ్య సన్నిహిత సంబంధాలకు సౌలభ్యం కల్పిస్తాయి.

# ఓటర్ల సందేహాలకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సమాధానాలు

అమరావతి, జులై 11:ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియపై ప్రజల్లో ఉన్న సందేహాలు, అపోహాలను నివృత్తి చేసేందుకు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ. శ్యామ్ ప్రసాద్ శనివారం కలెక్టరేట్‌లో ప్రత్యేక ఫోన్-ఇన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఓటర్ల నుంచి విశేష స్పందన లభించింది.

ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు నిర్వహించిన ఈ ప్రత్యక్ష కార్యక్రమంలో ఓటర్లు ఫోన్ ద్వారా అడిగిన పలు సాంకేతిక, సాధారణ ప్రశ్నలకు కలెక్టర్ వివరంగా సమాధానాలు ఇచ్చారు.

ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా నింపాలి, అందులో ఏ వివరాలు నమోదు చేయాలి, 2002 ఓటర్ల జాబితాలోని వివరాలను ఎలా పొందాలి, పేరు లేకపోతే ఏ విధంగా నమోదు చేసుకోవాలి వంటి అంశాలపై కలెక్టర్ స్పష్టమైన వివరణ ఇచ్చారు.

అలాగే బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు)ను ఎలా సంప్రదించాలి, ఇతర ప్రాంతాల నుంచి శాశ్వతంగా వచ్చిన వారు, వేరే రాష్ట్రం నుంచి వివాహం చేసుకుని వచ్చిన మహిళలు ఓటు హక్కు కోసం ఏ ప్రక్రియను అనుసరించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. అవసరమైన నివాస ధ్రువీకరణ పత్రాలతో ఫారం-8 ద్వారా ఓటు బదిలీ లేదా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎలాంటి అపోహాలకు తావివ్వకుండా ఓటర్లు తమ వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని సూచించారు.

# ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

### -కుటుంబ నియంత్రణతో ఆరోగ్యకర సమాజం సాధ్యమని వైద్యాధికారుల పిలుపు

కరీంనగర్, జులై 11: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర మాట్లాడుతూ జనాభా పెరుగుదలతో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై ఒత్తిడి పెరుగుతుందని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటిస్తూ, గర్భధారణల మధ్య తగిన వ్యవధిని పాటించాలని సూచించారు.

జులై 11 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే కుటుంబ నియంత్రణ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రి పెద్దపల్లి, జీజీహెచ్ రామగుండంలో కాపర్-టి, అంతరా ఇంజెక్షన్, నిరోధ్, డీపీఎల్, ట్యూబెక్టమీ, వాసెక్టమీ వంటి తాత్కాలిక, శాశ్వత కుటుంబ నియంత్రణ సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మాతా-శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మీభవాని, బసంత్‌నగర్ వైద్యాధికారి డాక్టర్ శరళి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లో రైల్వే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయండి..!

### -కేంద్రమంత్రి అశ్విని కుమార్ ను కలిసిన ఎమ్మెల్యే పాయల్ శంకర్..!



ఆదిలాబాద్, జులై 11:ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పెండింగ్ లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేసి పట్టణ ప్రజల చిరకాల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. శనివారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని కుమార్ వైష్ణవ్ ను హైదరాబాదులో కలుసుకొని ఇక్కడి సమస్యలు ఎమ్మెల్యే వివరించారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక రైల్వే ప్రాజెక్టులపై వినతి పత్రాన్ని సమర్పించారు.

ఆదిలాబాద్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ ఓబి), రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్ యుబి) నిర్మాణాలకు నూటికి నూరు శాతం కేంద్రనీ నిధులు మంజూరు చేసి పనులు వేగంగా కొనసాగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని అనేక రైల్వే బ్రిడ్జి ప్రాజెక్టులు నిధుల కొరతతో నిలిచిపోయినప్పటికీ, ఆదిలాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ వాటా లేకుండానే కేంద్ర నిధులతో పనులు వేగవంతమయ్యాయని తెలిపారు. నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి అవసరమైన భూసేకరణ పరిహారం కోసం పెండింగ్ లో ఉన్న రూ.14.89 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రిని ఎమ్మెల్యే కోరారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి..!

అదేవిధంగా ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ నుండి తాటిగూడ వరకు పాదచారులు, ద్విచక్ర వాహనాలు, తేలికపాటి వాహనాల రాకపోకలకు అనువుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్ ఓ బి) మంజూరు చేయాలని, దీంతో ప్రజల రవాణా భద్రతతో పాటు ట్రాఫిక్ సమస్యలు కూడా తగ్గుతాయని వివరించారు.

అలాగే గిమ్మ, బోరాజ్, మహాలక్ష్మీవాడ, ఆదిలాబాద్ అర్బన్ ప్రాంతాల ప్రజల రాకపోకల సౌకర్యార్థం కొత్త రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్ యు బి) మంజూరు చేయాలని కేంద్ర రైల్వే మంత్రికి ఎమ్మెల్యే విన్నవించారు. సమస్యలను సానుకూలంగా ఉన్న కేంద్ర మంత్రి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు.

# పెద్ద బెల్లల్‌లో గ్రామ కాంగ్రెస్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



ఆదిలాబాద్, జులై 11: నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు ఆదేశాల మేరకు కడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొడ్డు గంగన్న ఆధ్వర్యంలో పెద్ద బెల్లల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా తోట రాజేందర్, ఉపాధ్యక్షులుగా మైదం రమేష్, తాటికొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మెన గంగరాజం, కార్యదర్శులుగా ఆకుల రాజు, గంగినేని కిషన్, అధికార ప్రతినిధిగా మధుకర్, కోశాధికారిగా తాటికొండ రవి ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పాడం ప్యాటా, చిన్నరాజం, జగ్గ రమేష్, పడిగెల రాజారత్నం, ఆకుల చిన్న గంగన్నలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు. ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా వివరించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఆ విశ్వాసాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆర్టీఏ సభ్యుడు తుమ్మల మల్లేశ్ యాదవ్, కడెం మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ముడికె మల్లేశ్ యాదవ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జడ రాజేశ్వర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ముంజా ప్రసాద్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రెంకాల శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ ఈదుల తిరుపతి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు తక్కల రాధ సత్తన్న, బీఎల్ఏ సభ్యులు తిరుపతి, సురేష్, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోదావరిఖని బస్టాండ్‌కు ఆధునిక హంగులు..

### -ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు
### -అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్

కరీంనగర్, జులై 11: గోదావరిఖని బస్టాండ్‌ను మరింత ఆధునికంగా తీర్చిదిద్ది ప్రయాణికులకు అన్ని వసతులు కల్పించనున్నట్లు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక బస్టాండ్‌ను సందర్శించి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు గోదావరిఖని బస్టాండ్‌ను వినియోగిస్తున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బస్టాండ్‌లో ఆధునిక ప్లాట్‌ఫారమ్‌లు, ప్రయాణికుల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే బస్టాండ్ ఆవరణలో ప్రత్యేక ఆటో స్టాండ్‌తో పాటు ఆటో డ్రైవర్లకు అవసరమైన వసతులు కల్పిస్తామని తెలిపారు.

బస్టాండ్ పరిసరాల్లో ఫుట్‌పాత్‌లు నిర్మించి, పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.



ప్రయాణికులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్టాండ్‌ను అభివృద్ధి చేసి మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, సింగరేణి జీఎం డి. లలిత్ కుమార్, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, సంబంధిత శాఖల అధికారులు, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా రంగంలో సహకారానికి భారత్, ఆస్ట్రేలియా కార్యాచరణ ప్రణాళిక

న్యూఢిల్లీ, జులై 11: భారత్, ఆస్ట్రేలియా మధ్య క్రీడలు ఒక శక్తిమంతమైన వారధిగా ఉన్నాయి. ఇవి ప్రజలను కలుపుతూ, సహకారానికి కొత్త బాటలు వేస్తున్నాయి.

క్రీడారంగంలో సహకారానికి ఉద్దేశించిన 2023 అవగాహన ఒప్పందం (ఎమ్ఓయూ) ఆధారంగా, భారత్, ఆస్ట్రేలియా 'క్రీడా సహకార ప్రణాళిక' రూపుదిద్దుకుంది. ఇది మన ద్వైపాక్షిక సంబంధాలను సుదృఢంగా తీర్చిదిద్దడానికి ఆచరణీయమైన, భవిష్యత్తు ప్రాథమ్యాలను, అవకాశాలను నిర్దేశిస్తోంది.

భారత్ 2030లో కామన్‌వెల్త్ క్రీడలను అహ్మదాబాద్‌లో నిర్వహించనుంది. అలాగే ఆస్ట్రేలియా 2032లో ఒలింపిక్స్, పారాలింపిక్ క్రీడలను నిర్వహించనుంది. భవిష్యత్తులో ఒలింపిక్స్‌తో పాటు పారాలింపిక్ క్రీడలకూ ఆతిథ్యాన్ని ఇవ్వాలని భారత్ కోరుకుంటోంది. అంటే.. రాబోయే దశాబ్దం అందించే అవకాశాలను ఈ క్రీడా ప్రణాళిక పరిగణిస్తుంది. ఉమ్మడి ప్రాథమ్యాలను, సామర్థ్యాలను, వనరులను దృష్టిలో పెట్టుకొని సహకారం అవసరమయ్యే రంగాలను గుర్తిస్తుంది.

భారత్‌లోనూ, ఆస్ట్రేలియాలోనూ క్రీడల నిర్వహణ, క్రీడల కోసం అనుబంధ వ్యవస్థను అభివృద్ధిపరచడంలో ఎదురయ్యే అంతరాలను గమనించి, సాముదాయిక క్రీడలను ప్రోత్సహించడంలో క్రీడాసంస్థలు, వాణిజ్య సంస్థలు, రాష్ట్ర స్థాయి ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, బృందాల మధ్య అనుబంధాన్ని సుగమం చేయడానికి మేం కట్టుబడ్డాం. ఇరు దేశాలకు మేలు చేయగల అన్ని స్థాయుల్లోనూ పటిష్ఠ క్రీడా భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి సహకార ప్రధాన ప్రణాళికకు మద్దతివ్వడానికి కూడా మేం నిబద్ధతను చాటుకుంటున్నాం.

అమలు ప్రక్రియ ఆచరణ సాధ్యంగా, ఫలితాలను రాబట్టడంపై దృష్టిని కేంద్రీకరించేందిగా ఉండబోతోంది. దీనిలో భాగంగా అందుబాటులో ఉన్న వనరులతో పాటు ప్రధాన కార్యక్రమాల గడువులకు అనుగుణంగా ఏయే కార్యక్రమాలను చేపట్టాలో ఒక ప్రాధాన్య క్రమాన్ని నిర్దేశించుకుంటాం.

ఇప్పటికే ఏర్పరుచుకున్న భాగస్వామ్యాల ద్వారా సహకారాన్ని అందించుకుంటాం. ఈ సహకారానికి సరళతర వ్యవస్థల అండదండలను అందిస్తాం. అంతేకాకుండా, కార్యకలాపాల కోసం వనరులను అందుబాటులోకి తీసుకు వచ్చే బాధ్యతను ప్రతి ఒక్క సందర్భాన్ని లెక్కలోకి తీసుకుని ఖరారు చేస్తారు. ఈ దృష్టికోణం ఆచరణీయ, సుస్థిర, పరస్పరం లాభదాయక ఫలితాలను అందుకొనేందుకు దోహదం చేస్తుంది.

ఈ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ కింద ప్రస్తావించిన అంశాలను కీలకంగా గుర్తించారు...

**సామర్థ్యాలను పెంపొందించడం:**

భారత్‌లో ప్రాధాన్యత కలిగిన క్రీడలలో ఉన్నత స్థాయి ఆట తీరుకు అనువైన క్రీడా కేంద్రాలను నెలకొల్పడం. ఆ కేంద్రాలను నిర్వహించడంలో అత్యుత్తమ పద్ధతులను పంచుకోవడానికి సహకారాన్ని అందించుకోవడం.

పారా స్పోర్ట్స్‌ను ఒక కీలక ప్రాథమ్యంగా గుర్తించాలి. సహకారానికి తగిన అవకాశంగా చూడాలి. వీటిలో పారా వర్గీకరణ, కోచింగ్, ఆటతీరుకు మద్దతివ్వడంలో ఆస్ట్రేలియా నైపుణ్యాన్ని పొందడం ఒక భాగంగా ఉంటుంది. అంతేకాక ఉపయోగించుకోదగిన అంశాల్లో భారత్, ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయాల మధ్య సంభావిత సంబంధాలను నెలకొల్పుకోవాలి.

ఆస్ట్రేలియా కోచ్‌లను తీర్చిదిద్దే తీరుపై ఆధారపడిన, ఇరు పక్షాలూ ఇచ్చి పుచ్చుకొనే తీరును సరళతరంగా మార్చాలి. దీంతో భారత కోచ్‌లు, కోచ్ ఎడ్యుకేటర్లను ఆస్ట్రేలియాకీ, ఆస్ట్రేలియా కోచ్‌లు, కోచ్ ఎడ్యుకేటర్లను భారత్‌కీ తీసుకు రావాలి. ఉపయోగానికి వీలున్న చోట్ల 'ట్రయినరును ట్రయిన్ చేయడం' విధానాన్ని అనుసరించాలి.

భారత్, ఆస్ట్రేలియా మధ్య ఫిజికల్ ఎడ్యుకేషన్ మార్పిడి కార్యక్రమాన్ని మొదలుపెటవచ్చు. ఫలితంగా ఉభయ పక్షాలూ నేర్చుకోవడం, అత్యుత్తమ పద్ధతులను పంచుకోవడం మాత్రమే కాకుండా పాఠశాల క్రీడలు, క్రీడా విజ్ఞానం, ఫిజికల్ ఎడ్యుకేషన్ లో సామూహిక భాగస్వామ్యం వంటి రంగాల్లో సహకారాన్ని కూడా పెంపొందించుకోవచ్చు.

యోగాకు సంబంధించిన జ్ఞానాన్ని ఆస్ట్రేలియాకు పంచాలి. యోగా సంబంధిత సహకారాన్ని పెంపొందింప చేయాలి. యోగాలో భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఉన్న అవకాశాలను గుర్తించాలి. యోగా అందించే శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలకు, భారత్‌లో ప్రధాన కేంద్రాన్ని కలిగి ఉన్న యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ 'వరల్డ్ యోగాసన'కు గుర్తింపును ఇవ్వాలి.

ఇండియా ఆస్ట్రేలియా హై పెర్ఫార్మెన్స్ కోచ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాములో భాగంగా ఎంపిక చేసిన భారతీయ కోచ్‌లకు సామర్థ్యాన్ని పెంచడానికి ఆస్ట్రేలియన్ స్పోర్ట్స్ కమిషన్‌తో కలిసి పనిచేయాలి.

భారత ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ఉపకార వేతనాల ద్వారా ఆస్ట్రేలియాలో ఉన్నత స్థాయి ఆటతీరును ప్రోత్సహించే కార్యక్రమాల్లో భాగంగా ప్రతిభావంతులైన యువ భారతీయ అథ్లెట్లకు సాయపడడానికిగాను క్రీడా సంస్థలు, విశ్వవిద్యాలయాల వంటి సందర్భోచిత ప్రభుత్వేతర భాగస్వాముల ద్వారా అవకాశాలను అన్వేషించాలి.

**సహకార పూర్వక క్రీడా విజ్ఞానం, సాంకేతికత పరిశోధన:**

క్రీడాకారుల ఆటతీరుకు సంబంధించిన విశ్లేషణ, గాయాల నివారణ, క్రీడా సంబంధ పోషణ, ధరించడానికి అనువైన (ప్రదర్శనతో ముడిపడి ఉండే) సాంకేతికత, రికవరీ టెక్నిక్కులు, పారా స్పోర్ట్స్ రంగాల్లో భారత్, ఆస్ట్రేలియా లకు చెందిన విశ్వవిద్యాలయాల మధ్య సంయుక్త పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టులను ప్రోత్సహించాలి.

భారత, ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయాల మధ్య క్రీడా పాఠ్యక్రమాలకు సంయుక్త పద్ధతిలో రూపకల్పన చేయడానికిగాను భాగస్వామ్యాలను ప్రోత్సహించాలి.

నేషనల్ యాంటి-డోపింగ్ ఏజెన్సీ, స్పోర్ట్ ఇంటెగ్రిటీ ఆస్ట్రేలియా.. ఈ రెండు సంస్థలూ డోపింగుకు వ్యతిరేకంగా చేపట్టే అంతర్జాతీయ కార్యకలాపాల్లో పాలుపంచుకోవాలి. దీని కోసం వరల్డ్ యాంటి-డోపింగ్ ఏజెన్సీ (డబ్ల్యూఏడీఏ)కు చెందిన ఆసియా, ఓషనియా కార్యాలయంతో అనుబంధాన్ని ఏర్పరుచుకోవాలి. క్రీడా సంబంధ డోపింగుకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన 'యునెస్కో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అగైనెస్ట్ డోపింగ్ ఇన్ స్పోర్ట్ (కన్వెన్షన్) గ్రూప్స్'లో ప్రాతినిధ్యాన్ని స్వీకరించి, 'వాడా' నాయకత్వంలోని సామర్థ్య పెంపు కార్యక్రమాలకు మద్దతివ్వాలి.

**ప్రధాన క్రీడా కార్యక్రమాల నిర్వహణ:**

ఆస్ట్రేలియా లోని రాష్ట్రాలు, ప్రాంతాలతో పాటు జాతీయ క్రీడా సంస్థలకు సహకరించాలి. ఇది ప్రధాన కార్యక్రమాల నిర్వహణలో అత్యుత్తమ పద్ధతులను అనుసరించడానికి తోడ్పడుతుంది.

రెండు దేశాల్లోనూ పరస్పర ప్రయోజనాన్ని అందించే క్రీడలను (ఉదాహరణకు ఆస్ట్రేలియాలో కబడ్డీ, ఖో ఖో, భారత్‌లో ఆస్ట్రేలియా ఫుట్‌బాల్ లీగ్, బాస్కెట్‌బాల్ వంటివి) ప్రోత్సహించేందుకు ఎగ్జిబిషన్ మ్యాచులతో పాటు యువత పాలుపంచుకొనే కార్యక్రమాలను నిర్వహిస్తూ అవకాశాలను అందించాలి.

ఒలింపిక్స్, పారాలింపిక్స్, కామన్‌వెల్త్ క్రీడల వంటి ప్రధాన క్రీడా కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన సన్నాహాలతో కలిగే లాభాలను అందుకుంటూ, ప్రధాన క్రీడల నిర్వహణ కాలంలోనూ వాటి కోసం సన్నాహాల్ని చేపట్టే కాలంలోనూ భారత్, ఆస్ట్రేలియా క్రీడా సంస్థల మధ్య ఉమ్మడి సదుపాయాలు, పోటీలు, సహాయక నెట్‌వర్కులపై దృష్టి పెట్టి లాంఛనప్రాయ ఏర్పాట్లతో పాటు, ఇరు పక్షాలూ ఇచ్చి పుచ్చుకొనే తరహా ఏర్పాట్లు చేసుకోవాలి.

ఈ ఏడాది డిసెంబరులో చెన్నయ్‌లో నిర్వహించబోయే మొదటి బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్) మ్యాచును స్వాగతిస్తూ భారత్‌లో ఏటా బీబీఎల్ మ్యాచులకు ఆతిథ్యాన్ని ఇచ్చేందుకు ఆసక్తిని చూపేటట్లు క్రికెట్ ఆస్ట్రేలియాని, భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ)ని ప్రోత్సహించాలి.

క్రీడా సామగ్రి తయారీ, స్పోర్ట్స్ మీడియా, ప్రసారం, ఈవెంట్ మేనేజ్‌మెంట్, క్రీడా రంగ అంకుర సంస్థల్లో భారత్, ఆస్ట్రేలియా వాణిజ్య సంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి ఆస్ట్రేలియా ఆర్థిక సహాయంతో 2026 డిసెంబరులో ముంబయిలో నిర్వహించే క్రీడా పరిశ్రమ శిఖరాగ్ర సదస్సు తీర్మానాలకు కార్యరూపాన్ని ఇవ్వాలి.

సమాచారాన్ని అందజేసే కార్యక్రమాలను ఆదానప్రదానంగా నిర్వహించి భారత క్రీడా మార్కెట్లో ఆస్ట్రేలియా క్రీడా రంగ వాణిజ్య సంస్థలకు, అలాగే ఆస్ట్రేలియా క్రీడా మార్కెట్లో భారత్ క్రీడా రంగ వాణిజ్య సంస్థలకు వెసులుబాటును కల్పించాలి.

ఉన్నత నాణ్యత, పోటీపడే తత్వంతో కూడిన ధరలకు లభించే క్రీడా ఉపకరణాలను భారత్ నుంచి ఆస్ట్రేలియాకు ఇప్పటి కన్నా ఎక్కువ స్థాయిలో ఎగుమతి చేయాలి.

ఉత్తమ శ్రేణి ఆట తీరు అవసరమయ్యే క్రీడలలో ఆస్ట్రేలియా ప్రావీణ్య ఎగుమతి ప్రక్రియను విస్తరించాలి. దీనిలో శిక్షణ, కోచ్‌లను తీర్చిదిద్దడం, శక్తి, కండీషనింగ్, క్రీడాకారుల శ్రేయస్సు, పోషణ, మనోవిజ్ఞానం భాగంగా ఉంటాయి.

మహిళలకు ఆర్థిక సాధికారిత కల్పన, నాయకత్వం, ఆరోగ్యం, సామాజిక సమ్మిళితత్వ సాధనకు క్రీడలు ఒక శక్తిమంతమైన సాధనం అన్న విషయాన్ని గుర్తిస్తూ, ఆస్ట్రేలియా క్రీడా కమిషన్ ముఖ్య కార్యక్రమాల నుంచి స్ఫూర్తిని పొందుతూ సంయుక్త కార్యక్రమాలను మొదలు పెట్టాలి. ఆ కార్యక్రమాలు మహిళల్లో నేతృత్వం, ఆరోగ్యం, ఉన్నత స్థాయి ప్రదర్శన, భాగస్వామ్యాన్ని ప్రోత్సహిం చేవిగా ఉండాలి. దీనిలో మహిళా అథ్లెట్లకు ద్వైపాక్షిక ఆటల పోటీల నిర్వహణ కూడా ఒక భాగంగా ఉంటుంది.

## 13న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

**-పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి**
**-తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. కాటం రాజు**

నల్గొండ, జులై 11: దేశవ్యాప్తంగా ఈ నెల 13వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని (ఎన్‌డిడి) పురస్కరించుకుని 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని చౌటుప్పల్ మండలంలోని తంగడపల్లి వైద్యాధికారి డాక్టర్ చింతకింది కాటం రాజు పిలుపునిచ్చారు. ?ఈ కార్యక్రమ నిర్వహణపై తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లతో ఆయన ఒక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా డా. కాటం రాజు మాట్లాడుతూ.. సోమవారం ఈనెల13న జరగబోయే ఈ ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని ప్రతి ఒక్క విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ ఏదైనా కారణం చేత ఆ రోజు మాత్రలు వేసుకోలేకపోయిన విద్యార్థుల కోసం మళ్లీ జులై 20వ తేదీ 'మోప్-అప్' రౌండ్ నిర్వహించి, మిగిలిపోయిన పిల్లలందరికీ ఈ మాత్రలు అందిస్తామని స్పష్టం చేశారు. ?పిల్లల మెరుగైన ఆరోగ్యానికి, శారీరక ఎదుగుదలకు నులిపురుగుల నిర్మూలన ఎంతో అవసరమని, ఈ బృహత్తర కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది బాధ్యతగా భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

# సర్ ప్రక్రియను నెల రోజుల పాటు పొడిగించాలి

**-సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగోని సత్యనారాయణ డిమాండ్**




నల్గొండ, జులై 11:ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను మరో నెల రోజుల పాటు పొడిగించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగోని సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం చౌటుప్పల్‌లో నిర్వహించిన సిపిఐ మండల సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఓటర్లను చైతన్యం చేయడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. నియోజకవర్గం లో చాలా మందికి ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని, ఫారాలు నింపడంలో సరైన అవగాహన లేక ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బి.ఎల్.ఓలు ఇంటింటికీ తిరిగి ఫారాలు పంపిణీ చేయాల్సింది పోయి, ఓటర్లనే తమ వద్దకు వచ్చి ఫారాలు తీసుకోవాలని చెప్పడం సరికాదన్నారు.

గ్రామీణ స్థాయిలో అవగాహన కల్పించాలి

గ్రామ స్థాయిలో ప్రత్యేకంగా గ్రామ సభలు నిర్వహించి ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై సరైన అవగాహన కల్పించే విధంగా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని సత్యనారాయణ కోరారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగాలే తప్ప బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించే కుట్రగా మారకూడదని ఆయన హెచ్చరించారు. ఓటర్ల గుర్తింపు ప్రక్రియ ఆలస్యం అవుతున్నందున, గడువును మరో నెల రోజులు పొడిగించి.. అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా గల్లంతు కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండీ. ఇమ్రాన్, సిపిఐ మున్సిపాలిటీ కార్యదర్శి పగిల్ల మోహన్ రెడ్డి, నాయకులు ఉడత రామలింగం, కొందూరి వెంకటేష్, దాసరి అంజయ్య, టంగుటూరు రాములు, రోషణగారి అంజయ్య, రొండి నర్సింహా, బద్దుల సుధాకర్, నీళ్ల బిక్షపతి, కాకి పాండు, కుంటి పాపయ్య, దాసరి మనోహర్ పాల్గొన్నారు.

## ఘనంగా డిసిసి కార్యదర్శి జన్మదిన వేడుకలు..



నిజామాబాద్, జులై 11: నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మహమ్మద్ యూనుస్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం బాల్కొండ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. అనంతరం ఆదర్శ పాఠశాల విద్యార్థులకు స్వీట్లను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు చాట్ల నరేష్, పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వివేక్, నాయకులు కుందారం శ్రీనివాస్, మహమ్మద్ అన్వర్, గడ్డం రవి, సంతోష్ గౌడ్, హరికృష్ణ, ఎమ్మెస్ గౌడ్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్, ఉపాధ్యాయ బృందం తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## భీమ్‌గల్‌లో ఊర పండుగకు సర్వం సిద్ధం..

నిజామాబాద్, జులై 11: భీమ్‌గల్ పట్టణంలో ఆదివారం నిర్వహించనున్న సంప్రదాయ ఊర పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు కృష్ణ తెలిపారు. పండుగను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆదివారం ఉదయం చెట్టు కొట్టడం కార్యక్రమంతో పాటు విగ్రహాల చెక్కల ఊరేగింపుతో వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు.

అనంతరం భూలక్ష్మి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం సంప్రదాయంగా గొర్రెపోతు గావు పట్టడం కార్యక్రమం నిర్వహించి, రాత్రి 10 గంటలకు మైసమ్మ ఆలయం వద్ద ప్రత్యేక ముగింపు పూజలతో ఊర పండుగ ముగుస్తుందని వెల్లడించారు. పట్టణ ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని సంప్రదాయ పండుగను విజయవంతం చేయాలని సర్వసమాజ్ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# 'ఆంధ్రప్రదేశ్ ఎఫ్‌సీవీ పొగాకు మార్కెటింగ్ సీజన్ 2025-26'పై వాణిజ్య శాఖ సమీక్ష

న్యూఢిల్లీ, జులై 11: ఆంధ్రప్రదేశ్ ఫ్లూ క్యూర్డ్ వర్జీనియా (ఎఫ్‌సీవీ) పొగాకు మార్కెటింగ్ సీజన్ 2025?26 (పొగాకు కొనుగోళ్ల సమయం) పురోగతిపై కేంద్ర ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారుల బృందం హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించింది. వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి శ్రీ నితిన్ కుమార్ యాదవ్ (ఐఏఎస్) నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో పొగాకు రైతులు, తయారీదారులు, ఎగుమతిదారులు, డీలర్లు, వాణిజ్య సంఘాల ప్రతినిధులు, పొగాకు బోర్డు అధికారులు పాల్గొన్నారు.

ప్రస్తుత మార్కెట్ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించడంతోపాటు పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయాన్ని ఈ సమావేశం స్పష్టం చేసింది. పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేయడం, ఎగుమతులను సులభతరం చేయడం, ఎఫ్‌సీవీ పొగాకు మార్కెటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా దృష్టి సారించింది.

పొగాకు బోర్డు పనితీరును మరింత మెరుగుపరచడానికి వీలుగా దాన్ని పునర్వ్యవస్థీకరించడం, పొగాకు రైతుల సంక్షేమ నిధి కింద లభించే ప్రయోజనాలను పెంచడం, రిజిస్ట్రేషన్ ప్రక్రియలను సరళీకృతం చేయడం, సరికొత్త డిజిటల్ విధానాలను తీసుకురావడం, నాణ్యత నిర్ధారణ కోసం కృత్రిమ మేధ ఆధారిత గ్రేడింగ్ విధానాన్ని ప్రవేశపెట్టడం వంటి కార్యక్రమాల గురించి ఈ సమావేశంలో సమీక్షించారు.

అంతర్జాతీయంగా వివిధ దేశాల్లో భారత పొగాకుకు కొత్త ఎగుమతి అవకాశాలను విస్తరించడం, పొగాకు పండించడానికి అనుకూలమైన ప్రాంతాలలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడంపై కూడా చర్చించారు.

భాగస్వాములందరి సమన్వయ ప్రయత్నాలు భారతీయ ఎఫ్‌సీవీ పొగాకు రంగానికి దీర్ఘకాలిక స్థిరత్వాన్ని చేకూరుస్తాయని వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి శ్రీ నితిన్ కుమార్ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో భారత పొగాకు పోటీతత్వాన్ని పెంచడానికి ఈ చర్యలు ఎంతగానో దోహద పడతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

**-అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్**

నిర్మల్, జులై 11: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల నమోదును వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ సూచించారు. శనివారం నిర్మల్ పట్టణంలోని 19వ పోలింగ్ స్టేషన్ పరిధిలోని కల్వగడ్డ కృష్ణ మందిరంలో జరుగుతున్న ఎన్యుమరేషన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. అలాగే కల్వగడ్డ, రథలగూడి, బ్రహ్మపురి కాలనీల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఎల్‌వోలు, బీఎల్ఏలు పరస్పర సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఎలాంటి దరఖాస్తులు మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేసేందుకు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు భాగస్వాములు కావాలని తెలిపారు. కాలనీవాసుల సహకారంతో నిర్ణీత గడువులోగా కార్యక్రమాన్ని పూర్తి చేసి, పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దేవిదాస్, తహసీల్దార్ రాజు, వార్డు కౌన్సిలర్ నర్స, కో-ఆప్షన్ సభ్యురాలు అపర్ణ ప్రదీప్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# మక్తల్ నియోజకవర్గానికి రూ.320 కోట్లతో హ్యామ్ రోడ్లు..

**-13న పైలాన్ ఆవిష్కరించి పనులు ప్రారంభించనున్న**
**-మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి**

మహబూబ్‌నగర్, జులై 11:మఖ్తల్ నియోజకవర్గానికి మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో హ్యామ్ రోడ్ల అభివృద్ధి పనుల కోసం రూ. 320 కోట్ల నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ నెల 13న ఉదయం 9.30 గంటలకు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, డాక్టర్ వాకిటి శ్రీహరి పైలాన్ ఆవిష్కరించి పనులకు శ్రీకారం చుడతారని వెల్లడించారు.

పైలాన్ ఏర్పాటు పనులను పరిశీలించిన అనంతరం కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు కట్టా సురేష్ కుమార్ గుప్తా, మార్కెట్ వైస్ చైర్మన్ బి. గణేష్ కుమార్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి రవికుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాగనూరు మండల అధ్యక్షుడు శివరాం రెడ్డి, వాకిటి హనుమంతు మీడియాతో మాట్లాడారు.

సోమవారం ఉదయం 9.30 గంటలకు మఖ్తల్ పట్టణంలోని గురుకులం సమీపంలో నారాయణపేట రోడ్డుపై పైలాన్ ఆవిష్కరణ అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నారాయణపేట రహదారి దశాబ్దాలుగా అధ్వాన్నంగా ఉండేదని, మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో డబుల్ లైన్ రహదారిని ఫోర్‌లైన్‌గా అభివృద్ధి చేయడానికి రూ.237.71 కోట్ల నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. మఖ్తల్ నుంచి సింగారం గేట్ వరకు డివైడర్, మొక్కల పెంపకం, వీధి దీపాలతో ఆధునిక ప్రమాణాల మేరకు రహదారిని అభివృద్ధి చేసి ఎనిమిది నెలల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు వల్లంపల్లి లక్ష్మణ్, జిల్లా నాయకులు నారాయణ, శంకర్, కర్రెం అంజప్ప, బహదూర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క-సారలమ్మలను దర్శించేకున్న ఎమ్మెల్యే వెడ్మా..



మహబూబ్‌నగర్, జులై 11: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మేడారంలోని సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ మాట్లాడుతూ, సమ్మక్క-సారలమ్మల ఆశీర్వాదంతోనే తాను ఈ స్థాయికి చేరుకున్నానని అన్నారు. గత ఎన్నికలకు ముందు చేసుకున్న మొక్కు మేరకు కుటుంబ సమేతంగా వచ్చి మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు.

ప్రజలందరికీ సమ్మక్క-సారలమ్మల ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ఆదివాసీ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# మలాలా దినోత్సవం: బాలికల విద్యకు స్ఫూర్తిదాయకం

జూలై 12 – మలాలా యూసఫ్‌జై పుట్టిన రోజు. ఈ యువతీ పేరు ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా బాలికల హక్కుల కోసం నిబద్ధతకు ప్రతీకగా మారింది. 2013లో ఐక్యరాజ్య సమితి, ఆమె పుట్టిన రోజున 'మలాలా డే'గా ప్రకటించడం, విద్యపై విశ్వ వ్యాప్త చర్చకు దోహద పడింది. ప్రపంచం మొత్తం బాలికల విద్యపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ, ఈ రోజు ప్రతి సంవత్సరం విద్యా హక్కు, లింగ సమానత్వం, సామాజిక మానవీయతకు సంకేతంగా నిలుస్తోంది.

పాకిస్తాన్‌లో స్వాత్ లోయలో 1997లో జన్మించిన మలాలా, తాలిబాన్ కఠిన ఆంక్షల మధ్య బాలికల విద్యకు వ్యతిరేకంగా ఏర్పడిన పరిస్థితులను ఎదుర్కొంటూ, పదేళ్ల వయసులోనే విద్య హక్కుపై బ్లాగులు రాయడం ప్రారంభించింది. "విద్య మా హక్కు" అన్న నినాదాన్ని నిశ్చయంగా ముందుకు తీసుకు వెళ్లిన ఆమెపై 2012లో తాలిబాన్ తీవ్రవాదులు కాల్పులు జరిపారు. కానీ ఈ ఘటన ఆమె గొంతును నిస్సత్తువ చేయలేదు.. ప్రపంచాన్ని ఆలోచింప జేసింది. 2014లో మలాలా యూసఫ్‌జై నోబెల్ శాంతి బహుమతిని అందుకుంది. అతి చిన్న వయసులో ఈ ప్రతిష్ఠాత్మక బహుమతిని అందుకున్న ఆమె విద్యకు జీవితాన్ని అంకిత మిచ్చిన యువ నాయకురాలిగా నిలిచింది.

భారత దేశంలో బాలికల విద్య మీద ఆమె ప్రభావం గణనీయంగా కనిపిస్తోంది. దేశంలో విద్యను రాజ్యాంగం మౌలిక హక్కుగా ప్రకటించినప్పటికీ, బాలికలు అందులో పూర్తిగా పాలు పంచుకుంటున్నారని చెప్పలేం. గ్రామీణ నేపథ్యం, ఆర్థిక వెనుకంజ, సామాజిక ఆంక్షలు బాలికల విద్యార్థతను నిరుత్సాహ పరుస్తున్నాయి. మలాలా కథ వీటిని ఎదుర్కొనే ధైర్యానికి మార్గదర్శిగా మారింది.

2021–22 యూ డైస్ మరియు గణాంకాల ప్రకారం, బాలికల విద్యా నమోదు రేటు ప్రాథమిక స్థాయిలో 94.8% ఉన్నా, హైస్కూల్ స్థాయికి వస్తే ఇది 79.2%, సీనియర్ సెకండరీ స్థాయిలో 59.3%కి పడిపోతుంది. బాలికలపై నమ్మకం, భద్రతా భయం, బాల్య వివాహాలు, కుటుంబ ఆర్థిక పరిస్థితులు విద్యను మానేందుకు కారణాలు అవుతున్నాయి. అదే గణాంకాల్లో మాధ్యమిక స్థాయిలో బాలికల డ్రాప్ అవుట్ రేటు 16.1%గా నమోదైంది.




నేషనల్ ఫామిలీ హెల్త్ సర్వే – 5 (2019?21) ప్రకారం, దేశ వ్యాప్తంగా 18 ఏళ్ల లోపు పెళ్లయిన బాలికల శాతం 23.3%గా ఉంది. ఆంధ్ర ప్రదేశ్‌లో ఇది 29.3%, తెలంగాణలో 23.5%. ఇది బాల్య వివాహాలు ఇంకా బాలికల చదువుకు పెద్ద అడ్డంకిగా ఉన్నాయని చెబుతోంది. అక్షరాస్యత పరంగా చూస్తే ? పురుషుల అక్షరాస్యత 84.7%, మహిళలది 70.3%గా ఉంది. ఈ 14.4% తేడా ఇంకా సమానత్వానికి దూరంగా ఉన్నవారికి గుర్తు.

తెలుగు రాష్ట్రాల్లో బాలికల విద్యపై ప్రాధాన్యత ఉన్నా, ఇంకా చాలా చోట్ల సమస్యలు నిలిచే ఉన్నాయి. తెలంగాణలో బాలికల సెకండరీ విద్య నమోదు రేటు 82.5%, మహిళల అక్షరాస్యత 66.6%గా ఉంది. ఆంధ్ర ప్రదేశ్‌లో ఈ రేట్లు వరుసగా 79.8% మరియు 59.5%. ఇవి వాస్తవ పరిస్థితులే గాని, తగిన విధాన మార్పులు, సమర్థవంతమైన అమలు లేకపోతే కేవలం గణాంకాలుగా మిగిలి పోతాయి.

మలాలా దినోత్సవం ఈ దుస్థితికి ప్రతిస్పందనగా మేలుకొలుపు రోజు. ఇది విద్యను ఆశయంగా భావించాల్సిన అవసరాన్ని తెలియ జేస్తుంది.

ప్రతి బాలికకు స్థితిగతులు ఏవైనా విద్య, భద్రత, సమ్మేళన వాతావరణం లభించాలి. ఇందుకోసం ప్రభుత్వ కార్యక్రమాలు, స్వచ్ఛంద సంస్థల కృషి, తల్లిదండ్రుల ఆత్మ విశ్వాసం అత్యవసరం.

భారత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో బేటీ బచావో బేటీ పడావో, సుకన్యా సమృద్ధి యోజన, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, మిడ్డే మీల్స్, ఉపకరణాల పంపిణీ, సైకిల్ పథకాలు బాలికల విద్యలో చేరికను ప్రోత్సహిస్తున్నాయి.

అయితే ఇవి సరైన భద్రతా వాతావరణం, ఆరోగ్య, పారిశుధ్య సదుపాయాలు లేకపోతే ఫలప్రద మవ్వవు.

మలాలా "ఒక పుస్తకం, ఒక కలం, ఒక విద్యార్థి ప్రపంచాన్ని మార్చగలడు" అని చెప్పినట్లే, విద్యకు ప్రేరణ ఇవ్వడం అన్నది బాలికకు వ్యక్తిగతంగా కాక, సమాజానికి సైతం పెట్టుబడి.

ప్రతి ఊరిలో, ప్రతి పాఠశాలలో బాలికకు ఒక వెలుగు రేఖలా మారేలా మన కృషి సాగాలి.

జూలై 12 – మలాలా దినోత్సవం ఒక వ్యక్తి జయంతి మాత్రమే కాదు.

ఇది నేటి బాలిక విద్యార్థ్రాలు కావాలని కోరే సంకల్పానికి నిదర్శనం. బాలికకు విద్య అంటే – ఆమెకు భవిష్యత్తు, కుటుంబానికి ఆశ, సమాజానికి అభివృద్ధి. మలాలా చూపించిన మార్గం – మన దేశపు 12 కోట్ల బాలికలందరికీ ఆశతో నిండిన బాటగా మారాలి. విద్యతో వెలుగొందే సమాజమే అసలైన అభివృద్ధి లక్ష్యం.

జూలై 12 –మలాలా యూసఫ్‌జై పుట్టిన దినం



–రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో బండి సంజయ్ జన్మదిన వేడుకలు



రాజన్న సిరిసిల్ల, జులై 11:(నేటినిజం ప్రతినిధి): కేంద్రమంత్రి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ పుట్టినరోజు సందర్భంగా వేములవాడ బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా భీమేశ్వర ఆలయంలో అభిషేకం అర్చన కార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి జోడీ కోడెమొక్కు సమర్పించుకొని అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ హిందూ జన సంరక్షకుడు సనాతన ధర్మ పరిరక్షకుడు సంజయ్ అన్న నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవిస్తూ రాష్ట్ర ప్రజలకు పార్లమెంట్ పరిధి ప్రజలకు మరెన్నో సేవలు చేయాలని కోరుకున్నారు కౌన్సిలర్స్ కుమ్మరి శంకర్ ,కండ్లేపు ముత్యం వంగల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, నాయకులు రేగుల శ్రీకాంత్, మామిండ్ల లక్ష్మీరాజ్యం, కటకం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బండ మల్లేశం తదితరులు మాట్లాడుతూ రాజేశ్వర భీమేశ్వర స్వామివారిని సంజయ్ అన్న ఆరోగ్యంగా ఉంటూ రాష్ట్రంలో పార్టీ అధికారంలకు తెచ్చేలా వారికి బలాన్ని ఇచేలా దీవించాలని కోరుతున్నామని అన్నారు ప్రతాప రామకృష్ణ గారు మాట్లాడుతూ కేవలం వేములవాడ లోనే కాకుండా భారతదేశం మరియు రాష్ట్రవ్యాప్తంగా బిజెపి ఎదుగుదలకు ఎంతగానో కృషి చేస్తున్న బండి సంజయ్ గారి పుట్టినరోజు వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు.

ఈ సందర్భంగా భీమేశ్వర స్వామిని వారికి వారి కుటుంబానికి ఆరోగ్య సిరిసంపదలు మరెన్నో సేవలు చేసే భాగ్యాన్ని కల్పించాలని కోరుకున్నామని అన్నారు కావాలని వారిపై నిందలు వేసే ఇతర పార్టీల వారికి దేవుడే బుద్ధి చెప్తాడు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రేగుల రాజ్ కుమార్ జిల్లా నాయకులు రేగుల మల్లికార్జున్ మహిళ మోర్చ రాధిక డాక్టర్ వెంకన్న పట్టణ కమిటీ నాయకులు అన్నం నరసయ్య బిల్ల కృష్ణ రేడికింది అశోక్ చిక్కుడు మల్లేశం నామాల శేఖర్ సగ్గు రాహుల్ కిరణ్ హరీష్ అభిషేక్ జగన్నాథం శ్రీనివాస్ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు గ్యాసిఫికేషన్‌లోకి సింగరేణి

## –ప్రత్యామ్నాయ సాంకేతికతలపైనా దృష్టి




హైదరాబాద్, జులై 11:సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) బొగ్గు ఆధారిత ఇంధన రంగంలో మరో ముందడుగు వేయనుంది. భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ (అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్) రంగంలోకి ప్రవేశించేందుకు సంస్థ సన్నాహాలు ప్రారంభించింది. ఈ మేరకు బెల్లంపల్లి డిప్‌సైడ్ బ్లాక్‌లో పైలట్ ప్రాజెక్టు అమలుకు అవసరమైన డ్రిల్లింగ్ పనుల ఏర్పాట్లు జరుగుతున్నట్లు సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి వెల్లడించారు.

అలాగే భీమారం, చెన్నూరు సౌత్, నైనీ ప్రాంతాల్లో సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాలపై సాంకేతిక, ఆర్థిక అధ్యయనం కొనసాగుతోందని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా బొగ్గును మరింత సమర్థవంతంగా వినియోగించి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

అమ్మోనియం నైట్రేట్ మెల్ట్ ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడం, కేంద్ర ప్రభుత్వ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ వినియోగం, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం వంటి ప్రత్యామ్నాయాలపై కూడా సంస్థ దృష్టి సారించిందని వెల్లడించారు.

ఈ అంశాలపై కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీకాంత్ నాగులపల్లితో జరిగిన సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు సీఎండీ తెలిపారు. బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులు అమల్లోకి వస్తే సింగరేణిలో సాంకేతిక పరిజ్ఞానం విస్తరణతో పాటు ఇంధన రంగంలో కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చల్మెడ



వేములవాడ, జులై 11:కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన పోకల మధుకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, గ్రామ ఉపసర్పంచ్ తిక్కల నవీన్, సుద్దాల సర్పంచ్ కుంటెల్లి నాగరాజు, సీనియర్ నాయకులు గోపు పరశురాములు, మంతెన సంతోష్, యూసుఫ్, బైరగోని మల్లయ్య, నక్క ఎల్లయ్య, ఊరడి తిరుపతి, చొక్కాల దేవరాజు, షాదుల్, అనిల్, నజీర్, రవి, హరీనాథ్, సంతోష్, ఎక్కలదేవి రవి, భాస్కర్, లక్మిరాజం తదితరులు పాల్గొన్నారు.

# భారీ సైబర్ మోసాన్ని ఛేదించినందుకు గాను ఎఫ్ఐయూ-ఇండియాకి 'బెస్ట్ ఎగ్మాంట్ కేస్ అవార్డు (బీఈసీఏ) 2026'

న్యూఢిల్లీ, జులై 11:అంతర్జాతీయ స్థాయిలో ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్–ఇండియా (ఎఫ్ఐయూ–ఇండియా) మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపును దక్కించుకుంది. భారీ సైబర్ మోసానికి సంబంధించిన కేసును ఛేదించినందుకుగాను భారత విభాగానికి 'బెస్ట్ ఎగ్మాంట్ కేస్ అవార్డు (బీఈసీఏ) 2026' లో ద్వితీయ స్థానం లభించింది. అజర్‌బైజాన్‌లోని బాకులో జరిగిన 'ఎగ్మాంట్ గ్రూప్ ప్లీనరీ' సమావేశంలో ఎఫ్ఐయూ –ఇండియా డైరెక్టర్ శ్రీ అమిత్ మోహన్ గోవిల్ ఈ అవార్డును అందుకున్నారు.

ఎగ్మాంట్ గ్రూప్‌లో 'బెస్ట్ ఎగ్మాంట్ కేస్ అవార్డు' అనేది అత్యున్నత గుర్తింపులలో ఒకటి. ఆర్థిక నిఘా, అంతర్జాతీయ సహకారం, మనీ లాండరింగ్, ఉగ్రవాద నిధుల నిరోధంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన కేసులకు ఈ అవార్డును అందజేస్తారు. ఎగ్మాంట్ గ్రూప్‌లోని 182 సభ్య దేశాల నుంచి వచ్చిన ఎంట్రీలలో ఎఫ్ఐయూ–ఇండియా సమర్పించిన కేసు కేవలం రెండు ఫైనలిస్ట్ కేసులలో ఒకటిగా నిలిచి ఆ తర్వాత ఈ ప్లీనరీ సమావేశంలో రన్నరప్‌గా నిలిచింది.

భారీ సైబర్ మోసానికి సంబంధించి 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్' (ఐ4సీ) అందించిన సమాచారంతో ఈ కేసు విచారణ ప్రారంభమైంది.

ఆ తర్వాత ఎఫ్ఐయూ–ఇండియా చేసిన లోతైన ఆర్థిక విశ్లేషణలో సుమారు రూ. 868 కోట్ల సైబర్ మోసాల సొమ్ముతో కూడిన అత్యంత సంక్లిష్టమైన మనీ లాండరింగ్ నెట్‌వర్క్ బహిర్గతం అయింది. ఇందులో 5,000 కంటే ఎక్కువ మ్యూల్ బ్యాంక్ ఖాతాలు, వివిధ దేశాల పరిధిలో క్లిష్టమైన క్రిప్టోకరెన్సీ లావాదేవీలు ఉన్నట్లు గుర్తించారు.

ఈ దర్యాప్తులో 'ఎగ్మాంట్ సెక్యూర్ వెబ్' (ఈఎస్‌డబ్ల్యూ) ద్వారా అంతర్జాతీయ సహకారం ఎంత కీలకమైన పాత్ర పోషించిందో స్పష్టమైంది. సీమాంతర క్రిప్టోకరెన్సీ లావాదేవీలను కనిపెట్టడానికి, అంతర్జాతీయ మనీ లాండరింగ్ మూలాలను గుర్తించడానికి ఎఫ్ఐయూ–ఇండియా పలు దేశాల ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ విభాగాలతో సమాచారాన్ని మార్పిడి చేసుకుంది. ఇలా సకాలంలో సమాచారాన్ని పంచుకోవడం వల్ల దర్యాప్తు గణనీయంగా బలోపేతం అవడమే కాకుండా అంతర్జాతీయ ఆర్థిక నేరాలను అదుపు చేయడంలో ప్రపంచ దేశాల పరస్పర సహకారం ఎంత ముఖ్యమో ఈ కేసు నిరూపించింది.

ఎఫ్ఐయూ–ఇండియా అందించిన 'ఆపరేషనల్ అనాలిసిస్ రిపోర్ట్' ఆధారంగా డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈడీ) విస్తృతమైన చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా 13 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి రూ. 47 లక్షల నగదుతో పాటు సుమారు రూ. 13.6 కోట్ల విలువైన క్రిప్టోకరెన్సీని (యూఎస్‌డీటీ) సీజ్ చేసింది. అలాగే రూ. 8.67 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేయడమే కాకుండా 'మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) 2002' కింద రెండు ప్రాసిక్యూషన్ ఫిర్యాదులను (చార్జ్‌షీట్లు) దాఖలు చేసింది. ఈ అంతర్జాతీయ గుర్తింపు ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో భారత్‌కు పెరుగుతున్న నాయకత్వ పటిమను తెలియజేస్తోంది.

అత్యాధునిక ఆపరేషనల్ అనాలిసిస్, బలమైన అంతర్గత సమన్వయం, సమర్థవంతమైన అంతర్జాతీయ సమాచార మార్పిడి ద్వారా దేశంలోని 'మనీ లాండరింగ్ నిరోధక', 'కౌంటర్ ఫైనాన్సింగ్ ఆఫ్ టెర్రరిజం' (ఏఎంఎల్/సీఎఫ్టీ) నిబంధనలను మరింత బలోపేతం చేయడానికి ఎఫ్ఐయూ–ఇండియా కట్టుబడి ఉందని ఈ విజయం మరోసారి చాటిచెప్పింది.


# అమ్మ జన్మదినం.... విద్యార్థులకు బ్యాగుల వితరణ




రాజన్న సిరిసిల్ల, జులై 11:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ ఎంపీ యుపిఎస్ నాంపల్లి పాఠశాలలో కీర్తిశేషులు మద్దూరి వెంకటలక్ష్మి జయంతి సందర్భంగా వారి కుమారుడు విఠల్, కుమార్తెలు మీనా, శిల్పా గార్లు విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ మరియు మధ్యాహ్న భోజనం వితరణ చేయడం జరిగింది విద్యార్థులు భవిష్యత్తులో మంచి స్తానంలో ఉండాలని ఆకాంక్షించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు మద్దూరి వత్సల, ఉపాధ్యాయులు ఉమాదేవి, రజిత ,వినయ్ కుమార్,కమలాకర్ రెడ్డి, శైలజ, సన విద్యార్థులకు అందజేశారు

# వేములవాడ అర్బన్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు

## అగ్రహారం శ్రీ జోడు ఆంజనేయ స్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ నేతలు



రాజన్న సిరిసిల్ల, జులై 11:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

మండల అధ్యక్షు లు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో అగ్రహారం ఆంజనే యస్వామి దేవాలయంలో కేంద్ర మంత్రి బండి సంజ య్ కుమార్ పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించి, వారు ఆయురారోగ్యాలతో సుఖసంతో షాలతో ఉండాలని, కరీంనగర్, తెలంగాణతో పాటు దేశ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశాలు కలగాలని, రాజకీయాల్లో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రార్థించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు పండ్లను పంపిణీ చేశారు.అనంతరం వేములవాడ పట్టణంలోని నంది కమాన్ చౌరస్తాలో పార్టీ నాయ కులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బండి సంజయ్ ప్రజా సేవలో ఎల్లప్పుడూ ముందుంటూ ప్రజల సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు జింక అనిల్, చంద్రగిరి ప్రశాంత్, గుండెకార్ల లక్ష్మణ్, ఎరుగోకుల రమేష్, చల్ల నరసయ్య, పేరంగాని మల్లేశం, కంసాని రాము, సంజీవరెడ్డి, పడగేల బాబు, నాంపల్లి తిరుపతి, రెడ్డవేని రాజు, పోచంపల్లి భాను, ఎడ్ల హరీష్, చర్ల దేవరాజ్, జింక శేఖర్, లింగంపల్లి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.






శనివారం ముషీరాబాద్ శాసనసభ్యులు శ్రీ ముఠా గోపాల్‌గారు మరియు ముఠా జై సింహగారి ఆదేశాల ప్రకారం ఎస్ఐఆర్ రేనుమరేషన్ ఫారం నింపుటకు గాంధీనగర్ డివిజన్‌లోని ఎస్ ఆర్ టి క్వార్టర్స్‌లో బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎస్.టి ప్రేమ్ ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్‌కి బస్తీ వాసులకు సహకరిస్తూ వారి ఫారంలను నింపుతున్న ఎస్.టి ప్రేమ్, నింపిన ఫారంలను బిఎల్ఓకు అందజేస్తున్న కాలనీవాసులు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.